కోరిందేమిటి? ఇచ్చిందేమిటి?





- జిల్లా అడిగితే మండలంతో సరిపెట్టిన ప్రభుత్వం
- 17 గ్రామాలతో కొత్తగా పెద్దహరివాణం
- ఆదోని మండలం విభజన
- జిల్లాలో 27కి చేరిన మండలాల సంఖ్య
- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాభీష్టం మేరకే విభజన, వారి అవసరాలు, పరిపాలనా సౌలభ్యం కోసమే కొత్త జిల్లాల ఏర్పాటు అంటూ గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం ఆదోని ప్రాంతానికి తీరని అన్యాయం చేసింది. ఆదోని జిల్లా కోసం ఉద్యమించిన ప్రజలకు నిరాశ మిగలగా.. అసలు కోరని పెద్దహరివాణం గ్రామాన్ని మండలంగా మార్చేశారు. 65 సంవత్సరాలుగా ఆదోని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కన్నా ముందే ఆదోని జిల్లా డిమాండ్ పుట్టిందన్నది జగమెరిగిన సత్యం. కానీ ఈ డిమాండ్‌ను ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఘోరంగా విఫలమయ్యారు. ఫలితంగా జిల్లా ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నా కూడా ఆ కోరిక నెరవేరలేదు. ఎమ్మెల్యేలు, నాయకులు ఏకతాటిపైకి రాకపోవడంతో కరువుకు కేరాఫ్‌గా ఉన్న పశ్చిమ ప్రాంతం జిల్లాకు నోచుకోలేదు. మరో వాస్తవం ఏమిటంటే... ఆదోని జిల్లా ప్రస్తావన అసలు మంత్రుల కమిటీలో చర్చకే రాలేదు. ఆదోని ప్రాంత ప్రజల ఎదుట 'ఆదోని జిల్లా తెస్తాం.. ప్రాణాలైనా అర్పిస్తాం...' అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన నేతలు ఇప్పుడు ఎక్కడున్నారో మరి? మొత్తం మీద తాము జిల్లా కోరితే.. ఒక్క మండలం కేటాయించి సరిపుచ్చడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాల ఏర్పాటు కోసం గురువారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలో ఆదోని మండలం విభజించి.. కొత్తగా 17గ్రామాలతో పెద్ద హరివాణం మండలం ఏర్పాటుకు గెజిట్ విడుదల చేశారు. కొత్త మండలం ఏర్పాటుపై అభ్యంతరాలకు నెల రోజుల్లోగా తెలియజేయాలని అందులో పేర్కొన్నారు. ఆదోని జిల్లా చేయాలని ఇక్కడి ప్రజలకు బలంగా సెంటిమెంటు ఉంది. అదే క్రమంలో 46 గ్రామాలతో అతి పెద్ద మండలంగా ఉన్న ఆదోనిని మూడు మండలాలుగా విభజించాలని ప్రజలు డిమాండ్ చేశారు. 65 ఏళ్ల కల ఆదోని జిల్లా సాకారం చేయాలంటూ రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. జిల్లా విషయమే మంత్రివర్గ ఉపసంఘం పట్టించుకోలేదు. ఆ ప్రతిపాదనే తీసుకురాలేదు. అంతేగాకుండా ఆదోని, ఆదోని అర్బన్, పెద్దహరివాణం, పెద్ద తుంబళం నాలుగు మండలాలుగా విభజించాలని ప్రజలు, రాజకీయ నాయకులు కోరారు. ప్రజల ఆకాంక్షకు విరుద్ధంగా పెద్దహరివాణం కేంద్రంగా 17 గ్రామాలతో కొత్త మండలం ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం కొసమెరుపు. ఇక ఆదోని మండలంలో 29 గ్రామాలు మిగులుతున్నాయి. జిల్లాలో అతిపెద్ద మండలంగా ఉన్న ఆదోని, పెద్దహరివాణం మండలాలుగా విడిపోవడంతో జిల్లాలో మండలాల సంఖ్య 26 నుంచి 27కు చేరనుంది.

మండల విభజనలో లోపించిన పారదర్శకత

ఆదోని మండలాన్ని విభజించి కొత్తగా పెద్దహరివాణం మండలం చేయడం అభినందనీయమే. అయితే మండల నైసర్గిక స్వరూపాన్ని పరిశీలిస్తే.. పలు గ్రామాలకు మండలం అత్యంత దూరంగా ఉంటుంది. ఆదోనికి పెద్దహరివాణం దాదాపు 20కిలో మీటర్ల దూరంలో ఉంది. కొత్తగా ఏర్పడిన మండలంలోకి ఆదోనికి 3, 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న నారాయణపురం, చాగి, ధనాపురం, నాగనాతనహల్లి, మదిరే, కడితోట గ్రామాలను కల్పడం విమర్శలకు తావిస్తోంది. ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలంటే ఆదోనికి చేరుకుని అక్కడి నుంచి పెద్దహరివాణం వెళ్లాల్సి ఉంటుంది. పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన మండలం వల్ల పలు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అదే హొళగుంద, ఆదోని మండలాల్లోని గ్రామాలతో పెద్దహరివాణం మండలం ఏర్పాటు చేయడంతో పాటు పెద్ద తుంబళం, ఆదోని మూడు మండలాలు విభజించి ఉంటే అందరికీ ఆమోదయోగ్యకరంగా ఉండేదని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పాలనా సౌలభ్యం ప్రజల వద్దకు పాలన అందించేలా మూడు మండలాలుగా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



పెద్దహరివాణం గ్రామం

పెద్దహరివాణం మండలంలోకి వచ్చే గ్రామాలు

- పెద్దహరివాణం
- సంతకూడ్లూరు
- యడవల్లి
- బళదూరు
- చిన్నగోనేహాలు
- చిన్నహరివాణం
- మదిరే
- కడితోట
- హనవాలు
- జి.హోసల్లి
- బస్సాపురం
- వి. కొండాపురం
- నాగనాథనహల్లి
- నారాయణపురం
- ఛాగి
- ధనాపురం
- గణేకల్

ఆదోని మండలం పరిధిలోకి వచ్చే గ్రామాలు

- ఆదోని
- కల్లుబావి
- వెంగళాపురం
- పర్వతాపురం
- మండిగిరి
- ఎస్.కొండాపురం
- ఇస్వి
- గోనబావి
- దిబ్బనకల్లు
- నెట్టేకల్లు
- ఆరేకల్లు
- బైచిగేరి
- సలకలకొండ
- విరూపాపురం
- దొడ్డనగేరి
- సాంబగల్లు
- హువ్వనూరు
- కపటి
- బాసరకోడు
- చిన్న పెండేకల్లు
- బల్లేకల్లు
- మాత్రికి
- పాండవగల్లు
- దయ్యాలగుడ్డం
- కుప్పగల్లు
- జాలిమంచి
- సుల్తానాపురం
- పెసలబండ
- పెద్ద తుంబళం

ఓటర్ల మ్యాపింగ్ పకడ్బందీగా చేయండి



కర్నూలు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహిస్తున్న ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సిరి శిక్షణ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో కర్నూలు అర్బన్, పాణ్యం, ఆదోని నియోజకవర్గాల బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌వో)లతో ఎస్ఐఆర్-2026 శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల గురించి విచారించి, నిర్ణీత ఫారంలలో ఓటరు వివరాలు సేకరించుకోవాలని, ఆ తర్వాతనే డ్రాఫ్ట్ రోల్‌లో పేర్లు ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి తీసుకుని రావాలి

ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి తీసుకుని రావాలని ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ కలెక్టర్‌ను ఆదేశించారు. గురువారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫామ్స్‌ను త్వరగా క్లియర్ చేయాలన్నారు. కలెక్టర్ డాక్టర్ సిరి మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సంబంధించి ఈఆర్వోలకు, ఏఈఆర్వోలకు, బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించామన్నారు.

పంట దిగుబడులపై అవగాహన ఉండాలి

జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్



రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

కర్నూలు రూరల్ నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంట దిగుబడులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సూచించారు. కర్నూలు మండలం గార్గేయపురం గ్రామంలో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంచ సూత్రాల అమలు వాటి ప్రాధాన్యతను వివరించారు. శాస్త్రీయంగా వ్యవసాయం ద్వారా రైతులు ఏవిధంగా పురోగతి సాధించాలో సూచించారు. రైతులు పండించిన ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెటింగ్‌కు అవకాశాలు కల్పించాలని అధికారులను జేసీ ఆదేశించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సేవల గురించి రైతులకు వివరించాలన్నారు. పంట నిర్వహణ ఇన్‌పుట్ లభ్యత సాగునీరు, మార్కెటింగ్ వంటి సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ సాలురెడ్డి, తహసీల్దార్ టీవీ రమేష్‌బాబు, మండల వ్యవసాయ అధికారి రూఫస్ రొనాల్డ్, సర్పంచ్ ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన

- లెప్రసీ కేస్ డిటెక్షన్ సర్వే పరిశీలన



డీఎంహెచ్‌వోతో చర్చిస్తున్న కేంద్ర బృందం

కర్నూలు హస్పిటల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో కుష్టు వ్యాధిని నిర్మూలించేందుకు ఆరోగ్య కార్యకర్తలు నిర్వహిస్తున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ సర్వేను పరిశీలించేందుకు కేంద్ర బృందం గురువారం కర్నూలుకు వచ్చింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కేంద్ర బృందం డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్‌ను కలిసి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో 132 మందికి కుష్టు వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. వీరందరికీ 6 నుంచి 12 నెలల వరకు మల్టీ డ్రగ్ థెరపీ మందులు వచ్చి చికిత్స అందిస్తున్నామని కేంద్ర బృందానికి తెలిపారు. బృందం సభ్యుడు డాక్టర్ వి.శాంతారాం మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు సర్వే జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు డా. రితీ తివారి, డా. మాన్సి రాష్ట్రస్థాయి అధికారి డా. దేవసాగర్, న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ డా. మల్లికార్జున, కన్సల్టెంట్ సత్యవతి పాల్గొన్నారు.

2న అవిశ్వాస తీర్మానం

సమావేశానికి హాజరు కావాలని ఎంపీటీసీ సభ్యులకు నోటీసులు

కర్నూలు రూరల్ నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండల ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం వచ్చేనెల 2వ తేదీన ప్రవేశపెట్టనున్నారు. వైసీపీకి చెందిన ఉల్చాల ఎంపీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ కర్నూలు మండల ఎంపీపీగా కొనసాగుతున్నారు. మండలం నిధులు, ఇతర ప్రభుత్వ నిధులను ఎంపీటీసీ సభ్యులకు ఇవ్వకుండా తన స్వగ్రామానికే మళ్లించిందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఎంపీపీపై సొంత పార్టీ (వైసీపీ)ఎంపీటీసీ సభ్యుల నుంచే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలో కొంత మంది వైసీపీ ఎంపీటీసీ సభ్యులు టీడీపీలో చేరారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఎంపీపీ పదవి నాలుగేళ్లు పూర్తి అయితే తోటి సభ్యులు అవిశ్వాసం పెట్టవచ్చు. ఇప్పటికే కర్నూలు మండల టీడీపీ ఎంపీటీసీ సభ్యులు 13 మంది ఈనెల 7వతేదీన ఆర్డీవో సందీప్‌కుమార్ కలిసి కర్నూలు ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఫారం-2ను అందజేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఇప్పటికే మండలంలో ఉన్న 19మంది ఎంపీటీసీ సభ్యులకు డిసెంబరు నెల 2వ తేదీన కర్నూలు ఎంపీపీపై ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి హాజరు కావాలని నోటీసులను సిద్ధం చేసి ఎంపీటీసీ సభ్యులకు అందజేశారు.

బీపీఎస్, ఎల్ఆర్ఎస్ వేగవంతం చేయాలి

- కమిషనర్ విశ్వనాథ్, డీడీ సంజీవ్‌కుమార్



మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ పీనలైజేషన్ పథకం(బీపీఎస్), లేఅవుట్ రెగ్యులరైజేషన్ పథకం(ఎల్ఆర్ఎస్) అమలులో వేగం పెంచాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్, ప్రాంతీయ పట్టణ ప్రణాళిక ఉప సంచాలకుడు సంజీవ్‌కుమార్ సూచించారు. గురువారం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని క్రెడాయ్ భవనంలో బిల్డర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనుమతి లేకుండా, నిర్మించిన భవనాలు, అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జనవరి 23 వరకు ఎల్ఆర్ఎస్, మార్చి 11 వరకు బీపీఎస్ గడువు ఉందన్నారు. ఎల్ఆర్ ఎస్‌కు ఇప్పటి వకు రెండు విడతల్లో మొత్తం 1,988 దరఖాస్తులు అందాయన్నారు. ఇన్‌చార్జి సిటీ ప్లానర్ వెంకటరమణ, జిల్లా పట్టణ నిర్మాణ అధికారి శశిలత, కుడా సహాయ ప్రణాళికా అధికారి హయాత్ మొద్దీన్, టీపీవో అంజాద్‌బాషా పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి హత్య

- చంపి మద్దూరు వద్ద కుందూలో పడేశారు
- ఆలస్యంగా వెలుగులోకి..
- డబ్బు కోసమే జరిగి ఉండొచ్చని అనుమానం

5

ఆయిల్ పామ్‌తో లాభాలు

- 100 శాతం రాయితీ
- 500 హెక్టార్లలో ప్లాంటేషన్ ఏర్పాటు
- రైతులకు ప్రోత్సాహం కల్పిస్తున్న ఉద్యానశాఖ

4

బోగస్ 60 వేలు

- ఉపాధి హామీలో అక్రమ జాబ్‌కార్డులు
- గత వైసీపీ పాలనలో అక్రమం
- బోగస్ జాబ్‌కార్డులతో నిధులు స్వాహా
- కూటమి పాలనలో ఏరివేత



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఉపాధి హామీ పథకం ఆ పార్టీ నాయకులు, అనుచరుల జేబు నింపింది. కూటమి ప్రభుత్వం ఆధార్, ఈకేవైసీ తదితర కార్యక్రమాల ద్వారా బోగస్ జాబ్ కార్డుల ఏరివేత కార్యక్రమంలో ఇదంతా బైటపడింది. కర్నూలు జిల్లాలో 44,444 జాబ్‌కార్డులు బోగస్ అని తేలింది. నంద్యాల జిల్లాలో 17,663 బోగస్ జాబ్‌కార్డులను తొలగించారు. తమ అధికార బలంతో బోగస్ పేర్లు రికార్డుల్లో నమోదు చేయించి రూ. కోట్లల్లో నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 60వేల జాబ్‌కార్డుల తొలగింపు

కర్నూలు జిల్లాలో గత వైసీపీ పాలనలో 2,98,276 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఇచ్చారు. వారందరికీ వంద రోజుల పనిదినాలు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేశారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 2,50,117 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఇచ్చారు. ఇవన్నీ ఆనాటి వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న గ్రామాల్లోని నాయకులు బోగస్ జాబ్‌కార్డులని తేలింది. వీటి ద్వారా వైసీపీ నాయకులు జేబులు నింపుకున్నట్లు ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన ఏరివేత కార్యక్రమంలో వెలుగులోకి వచ్చింది. ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకుంటున్న ఈ అక్రమాలను సరి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2024 నుంచి ఎప్పటికప్పుడు సరికొత్త విధానాలను అమలు చేశాయి. పని చేసే కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి చేయడంతో జిల్లాలోని పలు గ్రామాల్లో బోగస్ కూలీల చిట్టా బయటపడుతోంది. కర్నూలు జిల్లాలో 44,444 జాబ్‌కార్డులు బోగస్ అని తేలింది. నంద్యాల జిల్లాలో 17,663 బోగస్ జాబ్‌కార్డులను తొలగించారు. మృతులు, గ్రామాలు వీడిన వారు ఇతరత్రా 60వేల మంది ఉమ్మడి జిల్లాలో ఆచూకీ లేకపోవడంతో వారి కార్డులను రద్దు చేశారు. మరో 30 వేల మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలోని వివిధ గ్రామాల్లో పెద్ద ఎత్తున వైసీపీ నాయకుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో బోగస్ కూలీల పేరుతో నిధుల స్వాహా చేసినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు చేపట్టిన చర్యలతో బట్టబయలైంది.

బోగస్ కార్డుల ఏరివేత చేపట్టాం



కర్నూలు జిల్లాలో 2,98,276 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఇచ్చాం. దాదాపు 5,56,672 మంది కూలీలు ఈ పథకం ద్వారా వంద రోజులు పనులు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బోగస్ కూలీలను ఏరివేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆధార్ కార్డు, ఈకేవైసీ ద్వారా బోగస్ కూలీల పేర్లు ఏరివేశాం. ఈకేవైసీ చేయించుకోని కూలీల జాబ్‌కార్డులు తొలగిస్తున్నాము. వాస్తవంగా గ్రామంలోనే ఉండి ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వారు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలి. లేకపోతే వాటి జాబ్‌కార్డులను తొలగిస్తాం.

\- వెంకటనారాయణ, డ్వామా పీడీ

వైసీపీ సానుభూతిపరులకు

గ్రామాల్లోని నిరుపేద కుటుంబాలకు ఏడాదిలో కనీసం వంద రోజులు పని చూపించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి జిల్లాలో రూ.400 కోట్లతో వివిధ రకాల పనులు ఏటా చేయిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో నాయకులతో పాటు కొందరు సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారు. ఆ పార్టీ సానుభూతిపరులకు ఉపాధి హామీ కూలీ పెద్దమొత్తంలో చెల్లించారనే వాదనలు వినిపిస్తున్నాయి. సామాజిక తనిఖీల్లో కూడా అవి బయటపడకుండా నాయకుల ఒత్తిళ్లతో సిబ్బంది జాగ్రత్త పడ్డారు. కొంత మంది క్షేత్ర సహాయకులు కూలీలు హాజరు కాకపోయినా వచ్చినట్లు, పని జరగకపోయినా జరిగినట్లు రికార్డుల్లో రాసేసుకుని ప్రభుత్వ సొమ్మును జేబుల్లో నింపుకుంటున్నారు. రెండు జిల్లాలో కలిపి దాదాపు రూ.10 కోట్లకు పైగానే ఉపాధి హామీ పథకం అమలులో దుర్వినియోగం జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

రెవెన్యూ డివిజన్‌గా బనగానపల్లె

- ఐదు మండలాలతో కలిపి ఏర్పాటు
- నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ
- 30 రోజుల్లో అభ్యంతరాలు
- ఆనందంలో ఆయా మండలాల ప్రజలు



నంద్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. గురువారం ప్రభుత్వ స్పెషల్ సెక్రెటరీ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఐదు మండలాలతో(బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల) కలిపి కొత్తగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో నేటి నుంచి 30 రోజుల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే జిల్లా కలెక్టర్‌కు తెలియజేయాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆతర్వాత కలెక్టర్ రాజకుమారి వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి అందజేయనున్నారు. ఇదిలా ఉండగా.. ఇప్పటికే జిల్లాలో నంద్యాల, ఆత్మకూరు, డోన్ రెవెన్యూ డివిజన్‌లు ఉండగా.. కొత్తగా బనగానపల్లె డివిజన్‌తో మొత్తంగా జిల్లాలో నాలుగు రెవెన్యూ డివిజన్‌లు కానున్నాయి. ఏది ఏమైనా కొత్త రెవెన్యూ డివిజన్ ప్రకటనతో ఆ ఐదు మండలాల ప్రజల్లో ఆనందోత్సవం మొదలైంది.

ఆయిల్ పామ్‌తో లాభాలు

- 100 శాతం రాయితీ
- 500 హెక్టార్లలో ప్లాంటేషన్ ఏర్పాటు
- రైతులకు ప్రోత్సాహం కల్పిస్తున్న ఉద్యానశాఖ


చాలమర్రిలో సాగు చేసిన ఆయిల్ ఫామ్ మొక్కలు

చాగలమర్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలను అందిస్తోంది. మొక్కల కొనుగోలు, ఎరువులు, అంతర్ పంటల సాగుతో పాటు మార్కెట్ సదుపాయం వరకు సౌకర్యాలు కల్పిస్తోంది. కూటమి ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా రాయితీపై మొక్కలు వంద శాతం రాయితీతో అందించడంతో జిల్లా రైతులు ఆసక్తి చూపుతున్నారు.

జిల్లా పరిధిలో ఇలా..

జిల్లాలో ఇప్పటికే 29 మండలాల్లో 1,200 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం ఉంది. 500 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు అవుతోంది. ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో చాగలమర్రి, రుద్రవరం, శిరివెళ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, ఆళ్లగడ్డ మండలాల్లో 350 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు అవుతోంది. దీనికి సంబంధించి రైతు సేవా కేంద్రాల నుంచి దరఖాస్తులు కూడా తీసుకుంటున్నారు. ఒక్కో ఎకరాకు 57 మొక్కలు త్రికోణాకార పద్ధతిలో నాటుకోవాల్సి ఉంటుంది. ఈ మొక్కల సరఫరాకు సంబంధించి నవభారత్ లిమిటెడ్ కంపెనీ 3ఎఫ్ ఆయిల్‌పామ్ కంపెనీ, పతంజలి ఆయిల్ ఫామ్, తుమ్మల ఆగ్రో ప్రాజెక్టు కంపెనీలకు ప్రభుత్వం కేటాయించింది.

ఆయిల్‌పామ్ సాగుకు 4 ఏళ్లకు రూ.62 వేలు, ఇంపోర్టెడ్ ఆయిల్‌పామ్ సాగుకు రూ.71 వేలు రైతులకు రాయితీ అందిస్తోంది. అంతేకాకుండా యాంత్రీకరణ, నీటి వసతి పరికరాలకు రూ20 వేలు నుంచి రూ.1.50 లక్షల వరకు రాయితీ ఇస్తోంది. అయితే మొదటి మూడు సంవత్సరాలు ఆయిల్‌పామ్ మొక్కలు పెంచేందుకు సమయం పడుతుంది. భూసారం, మొక్క ఎదుగుదలను బట్టి 4వ సంవత్సరం నుంచి ఫలసాయం చేతికందే అవకాశం ఉంది. ఆయిల్‌పామ్ సాగు చేసుకునే రైతులకు హెక్టారుకు ఇచ్చే రూ.5,250 నగదుకు కూడా మూడేళ్ల పాటు రాయితీ లభిస్తుంది. జిల్లాలోని రైతులను ప్రతి ఏడాది విహార యాత్రల ద్వారా ఆయిల్‌పామ్ సాగు చేసే ప్రాంతాలకు తీసుకెళ్లి అవగాహన కల్పించేందుకు కూడా రైతులను ఆయా కంపెనీలు ప్రోత్సహిస్తున్నాయి. ఆయిల్‌పామ్ తయారీ విధానంపై కూడా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

మార్కెట్ సదుపాయం కూడా..

ఆయిల్‌పామ్ మొదటి కాపు ఎకరానికి దాదాపు 3 నుంచి 4 టన్నులు వచ్చే అవకాశం ఉంది. 8 ఏళ్ల వయసు ఉన్న తోటల్లో ఎకరానికి 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. జిల్లా రైతులకు మొక్కలు అందిస్తున్న సంస్థలే పండిన పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. గతంలో టన్ను రూ.14 వేలు ఉన్న ఆయిల్‌పామ్ ధర ప్రస్తుతం రూ.17 వేలకు పైగా మార్కెట్‌లో రేటు పలుకుతోంది.


చింతలచెరువులో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

ఆయిల్‌పామ్ పంట సాగు వివరాలు

- మనదేశం, రాష్ట్రంలో వాతావరణం ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉంటుంది.
- ఆయిల్‌ఫామ్ సాగుకు అన్ని నెలలు అనుకూలమైనవి.
- ఏడాది వయసున్న ఆరోగ్యకరమైన మొక్కలను చతురస్రాకార పద్ధతిలో ఎకరాకు 50 మొక్కలు చొప్పున నాటుకోవాలి.
- వాతావరణ పరిస్థితులనుబట్టి ఒక మొక్కకు రోజుకు 150-300 లీటర్ల నీరు అందించాలి.
- సూక్ష్మ నీటి యాజమాన్యం అవలంబించడం ద్వారా నీటి వినియోగాన్ని పర్యవేక్షించవచ్చు.
- ఆయిల్‌పామ్ సాగుకు పశువుల ఎరువులు, జీవన ఎరువులు అతి ముఖ్యమైనవి.
- ఆయిల్‌పామ్ తోటలలో మొదటి 3 సంవత్సరాలు ఏక వార్షిక పంటలు, అంతర్ పంటలుగా పండించుకోవడానికి అనుకూలం.

4 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

4 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశా. మూడు నెలల క్రితం మొక్కలు నాటా. 200 మొక్కలకు రూ.40 వేలు దాక ఖర్చు చేశా. మొక్కలకు కంపెనీ వారు బిల్లులు చెల్లిస్తామని చెప్పడంతో మొక్కలు కొనుగోలు చేసుకొని సాగు చేసుకుంటున్నా.

\- సుద్దపల్లె బాషా, రైతు, చాగలమర్రి

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే..



ప్రభుత్వ ప్రోత్సాహంతోనే ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నాను. 6 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు మొక్కలు నాటి పెంచుతున్నా. నవభారత్ కంపెనీ వారు మొక్కలు కొనుగోలు చేసి ఉచితంగా అందజేశారు. మొక్కలు పచ్చగా ఏపుగా పెరిగాయి. మొక్కల మధ్య అంతర్ పంట సాగు చేసేందుకు వీలు ఉంది.

\- సాయిమోహన్‌రెడ్డి, రైతు, జ్ఞానాపురం

రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు



ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం 100 శాతం రాయితీ ఇస్తోంది. మార్కెట్‌లో మంచి ధర పలుకుతోంది. ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్ కాపీలతో రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. నీటి వసతి ఉన్న రైతులకు ఈ సాగు ఎంతో లాభాయకం.

\- దస్తగిరి, ఉద్యానశాఖ అధికారి, ఆళ్లగడ్డ

ఆయిల్‌పామ్ సాగు వల్ల లాభాలు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చును.
- తక్కువ కూలీలతో ఎక్కువ ఎకరాలు సాగు చేయవచ్చును.
- ఎటువంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులనైన పంట తట్టుకుంటుంది కాబట్టి నష్టం ఉండదు.
- ప్రతి ఎకరాకు 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.
- పండించిన మొత్తం పంటలను దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నేరుగా కంపెనీ వారికే అమ్ముకునే విధానం ఉంది.
- ప్రతి వారం నుంచి 10 రోజులకు ఒకసారి గెలల కోత, వచ్చే నగదును నేరుగా రైతు ఖాతాలో జమ చేస్తారు.
- ఆయిల్‌పామ్ రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే రూ.40 వేలు నుంచి రూ.49 వేలు హెక్టారుకు ప్రోత్సాహం.
- మొదటి 4 సంవత్సరాలు ఎరువుల కోసం నగదు బదిలీ పథకం ద్వారా రైతుకు అందిస్తారు.


ఆయిల్‌పామ్ నూనె తయారీ విధానంపై రైతులకు అవగాహన

యూపీపీఎస్‌సీ శిక్షణ దరఖాస్తుకు గడువు పొడిగింపు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అమరావతి ఆదేశాల మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు యూపీపీఎస్‌సీ సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్లు కర్నూలు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రసూన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ పరీక్షలకు ఉచిత శిక్షణ కావాలనుకొనే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను కర్నూలు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కార్యాలయంలో స్వయంగా వచ్చి తమ బయోడేటాతో పాటు రెండు ఫొటోలు, విద్యార్హత, కుల ఆదాయం, ఆధార్ కార్డు పాన్ కార్డు ధృవీకరణ జిరాక్సులను దరఖాస్తుకు జతపరిచి డిసెంబరు 3వ తేదీ సాయంత్రం 4గంటలోపు సమర్పించాలన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు అందని సాయం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా అందించే ఎస్కార్ట్ అలవెన్స్ మంజూరు చేయలేదు. కర్నూలు జిల్లా సమగ్ర శిక్ష శాఖ పరిధిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు మొత్తం 460 మంది ఉన్నారు. ఇందులో ప్రాథమిక పాఠశాలల స్థాయిలో 293 మంది కాగా, సెకండరీ స్కూల్ స్థాయిలో 167 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి ఒక్కొక్కరికి ఏడాదికి 10 నెలలకు గాను రూ.6వేలు ఆర్థిక సాయం తల్లిదండ్రుల ఖాతాలో జమ చేస్తుంది. జూన్ నుంచి అక్టోబరు నెల వరకు సంబంధించి ఎస్కార్ట్ అలవెన్స్ కేవలం 170 మందికి మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసింది. మరో 290 మందికి ఆర్థిక సాయం అందించకపోవడంతో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు ఆర్థిక సాయం మంజూరైన విషయంపట్ల ఐఆర్‌టీలలో స్పష్టత కరువైంది. ఇదిలా ఉండగా.. కర్నూలు జిల్లాలో భవిత కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఇచ్చే ఫిజియోథెరపిస్టుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో మొత్తం 9 ఫిజియోథెరపిస్టు పోస్టులు అవసరం కాగా, ఇందులో ఐదుగురు మాత్రమే పని చేస్తున్నారు. మిగతా నాలుగు పోస్టులు ఖాళీలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఫిజియోథెరపిస్టులకు ఇచ్చే గౌరవ వేతనం అంతంతంగా మాత్రంగా ఉండటంతో పని చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. వీరికి నెలకు 14,380 గౌరవ వేతనం ప్రభుత్వం చెల్లిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం వారికి ఇచ్చే గౌరవ వేతనం పెంచాలని ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- కరాటే విజేతలకు ఘన సన్మానం
- జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి సబిహా పర్వీన్


విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి పర్వీన్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సబిహా పర్వీన్ సూచించారు. ఇటీవలే హైదరాబాదులో కరాటే ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ప్రెసిడెంటు కప్ చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా విద్యార్థులను గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని అన్నారు. చిన్నప్పటి నుంచి క్రీడల్లో ప్రతిభ చాటుతూ దేశం గర్వించే స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం ఇంటలెక్చువల్ కలెక్టివ్ సంస్థ జిల్లా కన్వీనర్ ఎం. ఖదీరుల్లా మాట్లాడుతూ ఆటలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లాకు చెందిన విద్యార్థులు మహ్మద్ జేద్ (వెండి మెడల్), ముదాసిర్ (కాంస్యం), ముజహీద్ (కాంస్యం), మహీర్ (కాంస్యం), మరియం (కాంస్యం)లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరాటే ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కర్నూలు జిల్లా చైర్మన్ ఫారూక్, ప్రెసిడెంటు ఖాజా, టీడీపీ నాయకుడు రజాక్ పాల్గొన్నారు.

బైపాస్ పనుల్లో వేగం పెరగాలి

- పనులపై మంత్రి బీసీ సమీక్ష


అధికారులకు సూచనలు ఇస్తున్న మంత్రి

బనగానపల్లె, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో నిర్మిస్తున్న బైపాస్ నిర్మాణ పనుల్లో వేగం పెరగాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు అమరావతిలోని సచివాలయంలో బనగానపల్లె బైపాస్ రహదారి నిర్మాణంపై ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ వివేకానందారెడ్డి, కర్నూలు ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి, నంద్యాల ఈఈ శ్రీధర్‌రెడ్డితో మంత్రి సమీక్ష నిర్వహించారు. బనగానపల్లె బైపాస్ నిర్మాణం పనులు నిర్దేశిత వ్యవధిలో పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే బైపాస్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం 2 విడతలుగా రూ.5కోట్లు చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి బనగానపల్లె బైపాస్ నిర్మాణం పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు చొరవతీసుకొని పని చేయాలని కోరారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రజలకు మెరుగైన రహదారుల రూపకల్పనకు గుంతల రహిత రోడ్లను తీర్చిదిద్దాలని మంత్రి బీసీ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నంద్యాల జిల్లాలో చేపట్టిన రహదారుల అభివృద్ధి పనులను సాధ్యమైనంత వరకు పూర్తి చేయాలన్నారు.

స్పౌజ్ కోటాలో బదిలీ అవకాశం

- దంపతులకు ఒకే ప్రాంతంలో ఉద్యోగావకాశం
- ఈ నెలాఖరుకు ముగియనున్న సచివాలయ ఉద్యోగుల బదిలీలు



నంద్యాలలోని ఒక సచివాలయం

నంద్యాల టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): భార్య ఒక చోట, భర్త మరో చోట ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తుండడంతో పిల్లల పోషణ, వృద్ధుల సంరక్షణ విషయాల్లో ఇబ్బంది పడుతున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్య పరిష్కారం కానుంది. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు స్పౌజ్ కోటాలో అంతర్‌జిల్లా బదిలీలకు అనుమతి ఇచ్చింది. తద్వారా భార్యాభర్తలు ఒకే ప్రాంతంలో ఉద్యోగం చేసే అవకాశం వస్తుంది. ఈనెల 30కి బదిలీల ప్రక్రియ పూర్తి కానుంది.

జిల్లాలో వివరాలు ఇలా ఉన్నాయి

జిల్లాలో సచివాలయాలు: 516

సచివాలయం ఉద్యోగులు: 4,353

గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ 2019 సెప్టెంబర్‌లో ఆమల్లోకి వచ్చింది. 2022 జూలైలో ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టారు. ఆదే ఏడాది చివర్లో స్పౌజ్ కోటాలో బదిలీలు చేపట్టారు. అప్పట్లో పరస్పర అంగీకారం మేరకు బదిలీలు నిర్వహించేవారు. దీంతో చాలా మంది ఉన్నచోటి నుంచి వేరే ప్రాంతానికి కదల్లేని పరిస్థితి ఏర్పడింది. మళ్లీ స్పౌజ్ కోటాలో బదిలీలకు అవకాశం కల్పించ లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి నిబంధనల ప్రకారం బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి



ఈనెల చివరి వరకు సచివాలయం ఉద్యోగులు సౌజ్ కోటాలో బదిలీ పొందడానికి అవకాశం ఉంది. దీన్ని ఉపయోగించుకోవాలి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు చేయాలి.

\- బండి శేషన్న, మున్సిపల్ కమిషనర్, నంద్యాల

ప్రగతి పథంలో సైన్స్ కీలకం

మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జేవీ కృష్ణయ్య



మాట్లాడుతున్న మూఢనమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జేవీ కృష్ణయ్య

కర్నూలు కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్యకారణ సంబంధం, సత్యాన్వేషణ, హేతుబద్ధత నేర్పించే సైన్స్ సామాజిక ప్రగతిలో కీలకమని మూఢనమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జేవీ కృష్ణయ్య అన్నారు. సైంటిఫిక్ థాట్ డే, కుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని సోమప్పకాలనీలోగల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జేవీ కృష్ణయ్య మాట్లాడుతూ వైజ్ఞానిక స్పృహ, శాస్త్రీయ స్పృహలను సైంటిఫిక్ టెంపర్ కింద పరిగణిస్తారని అన్నారు. ప్రజలకు సైంటిఫిక్ టెంపర్ లేకపోవడం వల్లే సమస్యలు వచ్చినప్పుడు దొంగ బాబాలు, స్వామీజీలు, సన్యాసులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బి. నాగభూషణం, ఆర్గనైజింగ్ కార్యదర్శి సీవీ వర్మ, విశ్రాంత అధ్యాపకుడు శివశంకర్ తదితరులు ప్రసంగించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ


ఇంటెలిజెన్స్ డీఎస్పీ వెంకటేశ్వర్లును ఆశీర్వదిస్తున్న వేదపండితులు

మహానంది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం ప్రత్యేక పూజలు జరిపారు. వీరికి ఆలయం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం డీఎస్పీ కుటుంబ సమేతంగా ప్రధాన ఆలయాల్లో అభిషేకార్చన పూజలను నిర్వహించుకున్నారు. వీరిని కల్యాణమంటపంలో వేదపండితులు వేదాశీర్వచనం ఇవ్వగా ఏఈఓ మధు ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

కూటమి హయాంలో శ్రీశైలం అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి


శ్రీశైలంలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

శ్రీశైలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రాముఖ్యతను సంతరించుకుంటున్న శ్రీశైల క్షేత్రం అభివృద్ధి కూటమి ప్రభుత్వ హయాంలోనే జరుగుతోందని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం శ్రీశైలానికి వచ్చిన ఆయన స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం దేవస్థాన అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ జ్యోతిర్లింగ శక్తిపీఠమైన శ్రీశైల క్షేత్రాన్ని దర్శించుకుని కర్నూలులో బహిరంగ సభ ఏర్పాటు చేయడం ఆంధ్ర రాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. ప్రధానంగా యాత్రికుల రవాణా సౌకర్యాలు మెరుగుపరుచే దిశగా రైలు, వాయు మార్గాల కేటాయింపు కోసం కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం ఎంపీ బైరెడ్డి శబరి చేస్తున్న ప్రయత్నాలు విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా క్షేత్రానికి వస్తున్న భక్తులను ప్రత్యక్షంగా దళారులు.. పరోక్షంగా సైబర్ మోసగాళ్లు దగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల తిరుపతి తరహాలో మోసాలను అరికట్టడానికి అన్ని విధాలుగా కట్టుదిట్టం చేసే విజిలెన్స్ శాఖ ప్రత్యేక భద్రతా అధికారులు సిబ్బంది ఆవశ్యకత ఉందన్నారు. విజిలెన్స్ ఏర్పాటుపై ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలియజేశారు. శ్రీశైల దేవస్థానంలో అర్హులైన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వివిధ విభాగాల్లో సుమారు 400 అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఎంపిక చేసేందుకు దేవదాయ ధర్మాదాయ శాఖ జారీ చేసిన ఉత్తర్వులను రాజకీయం చేయకూడదని కోరారు. ప్రధానంగా జోన్ పరిధిలో ఉండే యువతకు తొలి ప్రాధాన్యతనిస్తూ అవకాశాలు కల్పించాలని సూచించారు.

కర్నూలును కమ్మేసిన మంచు









జిల్లాలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో కర్నూలు నగరాన్ని మంచు కమ్మేస్తోంది. తెల్లవారుజామున కురుస్తున్న మంచు చూపరులను ఆకట్టుకుంటోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా గురువారం పల్లెసీమను తలదన్నేలా కర్నూలు నగరంపై మంచు తెర కమ్ముకుంది. పొద్దుపొద్దున్నే పక్షుల కిలకిల రావాలు.. పువ్వులపై మంచు బిందువులతో కూడిన కర్నూలు శివారు ప్రాంతం హిమగిరులను తలపిస్తోంది. కర్నూలులోని జగన్నాథగట్టుపై నుంచి తెల్లవారుజామున చూస్తే ఆహ్లాదకరమైన మంచు వాతావరణం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తోంది. ఇక పొగమంచును చీల్చుకుంటూ వస్తున్న ఉదయ భానుడి దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి.

- కర్నూలు రూరల్, ఆంధ్రజ్యోతి

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కర్నూలు

విశ్రాంత ఉద్యోగి హత్య

- మద్దూరు వద్ద కుందూలో శవం
- ఆలస్యంగా వెలుగులోకి..
- డబ్బు కోసమే జరిగి ఉండొచ్చని అనుమానం

నంద్యాల టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పుల్లయ్య (60) రిటైర్డ్ ఉద్యోగిని దారుణంగా హత్య చేసిన సంఘటన నంద్యాలలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి.. నంద్యాల పట్టణం శ్యాం నగర్‌కు చెందిన పుల్లయ్య కేంద్ర ప్రభుత్వ శాఖలో పని చేస్తూ పదవీ విరమణ పొందినట్లు తెలిపారు. ఇటీవలనే భార్యతో విడాకులు తీసుకున్నట్లు సమాచారం. వీరికి ఇద్దరు కుమారులున్నారు. ఒకరు బెంగళూరులో ఉండగా మరొకరు చెన్నైలో ఉన్నారు. అయితే బెంగళూరులో ఉన్న కుమారుడి వద్ద భార్య ఉంది. పుల్లయ్య ఇటీవల పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చిన డబ్బులతో రూ.30 లక్షలు, కొంత బ్యాంకు రుణం తీసుకుని ఇల్లు కొని తిరిగి, రూ.75 లక్షలకు విక్రయించారు. అందులో కొంత మొత్తాన్ని లోన్ కట్టారు. అయితే కొని అమ్మడంలో వైఎస్ నగర్‌కు చెందిన ఒక బ్రోకర్ (రౌడీ షీటర్) పరిచయం అయ్యాడు. అతని వద్ద నుంచి ఎలాగైనా డబ్బులు తీసుకోవాలని పన్నాగం పన్నాడు. దీంతో మిగిలిన డబ్బులకు పొలం కాని, ఇల్లు కాని కొనుక్కో అని అతన్ని నమ్మించి కారులో ఎక్కించుకుని వెళ్లాడు. తండ్రి ఎన్ని రోజులైనా ఫోన్ చేయకపోవడంతో చెన్నైలో ఉన్న కుమారుడు ఆదిత్య ప్రసాద్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు దర్యాప్తు చేపట్టారు. విచారణలో మృతుడి కాల్ డేటా, సీసీ కెమెరాలతో పరిశీలించగా వారు తీసుకెళ్లిన వివరాలు అన్ని తీసుకుని నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. కారులో ఎక్కించుకుని ఈనెల 14న తాడుతో గొంతుకు బిగించి చంపి మద్దూరు వద్దకు వెళ్లి మృతదేహాన్ని కుందూ నదిలో పడేసినట్లు తెలిపారు. మృతదేహం లభ్యం కాలేదు. నిందితుల్లో పాత నేరాల్లో ఉన్నవారే ఉన్నట్లు సమాచారం. పూర్తిగా ఇంకా విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో ఐదుగురు?

నంద్యాల పట్టణానికి చెందిన రిటైర్డు ఉద్యోగి అదృశ్యం కీలక మలుపు తిరిగింది. సదరు ఉద్యోగికి చెందిన స్థలం(ఇల్లు) విక్రయం నేపథ్యంలో తలెత్తిన ఆర్థిక లావాదేవీలతో హత్యకు గురైనట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. నంద్యాల పట్టణానికి చెందిన నలుగురు, గడివేముల మండలానికి చెందిన మరొకరు కలిసి ఈనెల 15న ఓ వాహనంలో ఉద్యోగి పుల్లయ్యను ఎత్తుకెళ్లి హత్య చేసినట్లు పోలీసుల విచారణ తేలింది. అయితే ఈనెల 19వ తేదీన బాధితుడి కుమారుడు తమ తండ్రి కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిపై పోలీసు రికార్డుల్లో పలు కేసులు నమోదయ్యాయి. మిగిలిన వారిపై అక్కడక్కడ ఉన్నట్లు తెలిసింది. హత్యకు పాల్పడిన వారిలో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికీ మృతదేహం ఆచూకీ పోలీసులు కనిపెట్టక పోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి రిటైర్డు ఉద్యోగి ఆచూకీ కోసం దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.

వేధింపుల కేసు నమోదు

కొత్తపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెళ్లై మూడు సంవత్సరాలైన అదనపు కట్నం కావాలంటూ వేధించడంతో భర్త, అత్తమామ, ఆడపడుచులపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయశేఖర్ గురువారం తెలిపారు. వివరాలు.. కొత్తపల్లి మండలం ఎర్రమటంకి చెందిన కొమ్ము సునీతను నందికొట్కూరు చెందిన అఖిల్‌కుమార్‌కు ఇచ్చి మూడేళ్ల క్రితం పెళ్లి చేశారు. వివాహం సమయంలో సునీత తల్లిదండ్రులు కట్నకానుకలు ఇచ్చారు. అయినప్పటికీ అదనపు కట్నం కావాలంటూ ఆమెను భర్త, అత్తమామలు, ఆడపడుచుతో పాటు భర్త స్నేహితుడు కూడా వేధించేవారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

రుద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామానికి చెందిన సింధూర (27) బుధవారం అర్ధరాత్రి ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ మహ్మద్ రఫి గురువారం తెలిపిన వివరాలివీ.. చందలూరు గ్రామానికి చెందిన పెద్దనరసింహుడితో పాణ్యం మండలం తొగర్చేడు గ్రామానికి చెందిన సింధూరకు ఎనిమిదేళ్లక్రితం వివాహమయింది. పెద్దమ్మాయి చందనకు ఆరోగ్యం బాగా లేదు. ఆళ్లగడ్డలో ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాలని భార్య కోరింది. ఆళ్లగడ్డలో జరిగే ఓ వివాహానికి కూతురు చందన, అత్త, భర్త పెద్దనరసింహుడు వెళ్లారు. హాస్పిటల్ చూపించలేదని భార్యభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. క్షణికా వేశానికి లోనై ఆత్మహత్య చేసుకుంది. సింధూర తండ్రి పెద్ద సుబ్బ నరసింహుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

జోహరాపురంలో మరొకరు..

కర్నూలు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో జోహరాపురంలో జ్యోతిక (24) ఆత్మహత్య చేసుకుంది. ఈ మహిళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన భర్త అరుణ్ కుమార్ గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతురాలికి కూతురు ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెల్దుర్తి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జీన్ రైల్వేగేట్ వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బోయ మహేష్(32) అనే యువకుడు మృతి చెందాడు. మండల పరిధిలోని మల్లెంపల్లె చెందిన మహేష్ వెల్దుర్తి పట్టణంలో నివాసముంటున్న తన తల్లి వద్దకు బైక్ మీద వచ్చి స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా హైవేలో కర్నూలు నుంచి బెంగుళూరు వెళ్తున్న ఐచర్ వాహనం బైక్ ఢీకొట్టింది. మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడ్ని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహేష్ కోలుకోలేక మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతునికి భార్య కృష్ణవేణి, ముగ్గురు సంతానం ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విత్తన కంపెనీపై చర్యలు తీసుకోండి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం ప్రతినిధులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ వరి విత్తనాలు అంటగట్టి నష్టపరిచిన లేఖన కంపెనీని సీజ్ చేయాలని, ఆ విత్తనాలు అమ్మిన కిసాన్ సీడ్స్ డీలర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ కలెక్టరేట్‌లోని అధికారులకు ఫిర్యాదు చేశారు. వ్యవసాయ శాఖ సూపరింటెండెంట్ పద్మజకు వినతి పత్రాన్ని అందజేశారు. కర్నూలు జిల్లాలో వివిధ కంపెనీలు ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు నాసిరకం, కల్తీ విత్తనాలను అంటగడుతున్నాయని ఆరోపించారు. అక్రమాలను గుర్తించినా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చూపడం దారుణమన్నారు. ఇటీవల నందికొట్కూరు, కల్లూరు, కోడుమూరు, తదితర ప్రాంతాల్లో నకిలీ విత్తనాల వల్ల మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, అధికారుల దృష్టికి తెచ్చినా నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. ఐదు వారాల క్రితం నాసిరకం వరి విత్తనాల సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా, అధికారులు నిమ్మకు నీరెత్తి ఉండిపోయారని ఆరోపించారు. నిడ్జూరు మాజీ సర్పంచ్ కృష్ణ, రైతులు వెంకటేశ్వర్లు, గిడ్డయ్య, శ్రీనివాసులు, అయ్యస్వామి, సోమశేఖర్, శేషాద్రి పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లు గజ గజ..

- వణికిపోతున్న విద్యార్థులు
- అందుబాటులో లేని నైట్ వాచ్‌మెన్, వార్డెన్
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- కోసిగిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో దుస్థితి



పగిలిపోయిన కిటికీలు



ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో దుప్పట్లు లేక చలికి వణుకుతూ పడుకున్న విద్యార్థులు

ఆంధ్రజ్యోతి విజిట్

కోసిగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు గజ గజ వణికిపోతున్నారు. దుప్పట్లు లేక విద్యార్థులు చలితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్‌లో కిటికీలు కూడా లేకపోవడంతో చల్లటి ఈదురు గాలులు విద్యార్థుల గదుల్లోకి వస్తుండటంతో చలికి వణికిపోతున్నామనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం హాస్టల్‌లో కింద పడుకునేందుకు దుప్పట్లు ప్రభుత్వం ఇచ్చిందని, కప్పుకోవడానికి దుప్పట్లు ఇవ్వలేదని విద్యార్థులు తెలుపుతున్నారు. కోసిగి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 5 నుంచి 10వ తరగతి వరకు 146 మంది విద్యార్థులు ఉంటున్నారు. గురువారం రాత్రి 9:30 గంటలకు హాస్టల్‌ను ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా.. విద్యార్థులు దుప్పట్లు చలికి వణుకుతూ దోమలతో ఇబ్బందుల పడుతూ నిద్రిస్తున్నారు. ఈ హాస్టల్‌లో నైట్ వాచ్‌మెన్, వార్డెన్ కూడా ఎవరూ లేకపోవడం గమనార్హం. హాస్టల్‌లో ఓ ప్రైవేటు వ్యక్తి మాత్రమే ఉన్నారు. అయితే విద్యార్థులకు ఏదైనా జరిగితే అడిగే నాథుడే లేడు. మౌలిక వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదనవ్యక్తం చేశారు. ఈ విషయంపై హాస్టల్ వార్డెన్ గోపాల్‌ను వివరణ కోరగా.. తాను ఎమ్మిగనూరులో ఉన్నట్లు తెలిపాడు.

దుప్పట్లు లేవు.. చలికి వణుకుతున్నాం



హాస్టల్‌లో కిటీకి అద్దాలు పగిలిపోయాయి. అందులో నుంచి చల్లగాలి వీస్తోంది. దుప్పట్లు లేకపోవడంతో చలికి వణుకుతూ అలాగే నిద్రపోతున్నాం. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. **- ప్రవీణ్ కుమార్, 8వ తరగతి విద్యార్థి**

కిటికీలు బాగు చేయాలి



హాస్టల్‌లో కిటికీలు పగిలిపోవడంతో బయట నుంచి చల్లని గాలులు, దోమలు వస్తున్నాయి. హాస్టల్‌లో దోమలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సమస్యను వార్డెన్‌కు చెప్పాం. పరిష్కరించడం లేదు. పగిలిపోయిన కిటికీలు బాగు చేసి మాకు దుప్పట్లు ఇవ్వాలని కోరుతున్నాం.

- అజయ్, 9వ తరగతి విద్యార్థి

చెలరేగిన దొంగలు

- జిల్లాలోని పలు చోట్ల చోరీలు
- కర్నూలులో 8 తులాల బంగారం, కొలిమిగుండ్లలో బైకు, కల్లుదేవకుంట గ్రామంలో దొంగతనాలు

సినీ ఫక్కీలో చోరీ, బంగారు ఆభరణాల అపహరణ

కర్నూలు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అమరావతి హోటల్ వద్ద సినిమా ఫక్కీలో రఘురామిరెడ్డి అనే వ్యక్తి కారులోంచి సుమారు 8 తులాల బంగారు ఆభరణాల చోరీ జరిగింది. వెల్దుర్తికి చెందిన రఘురామిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి కర్నూలు నగల దుకాణానికి వచ్చాడు. అక్కడ 8 తులాల బంగారు ఆభరణాలు కొన్నాడు. ఆ తర్వాత గాయత్రి ఎస్టేట్ వెళ్లి అక్కడ ఆసుపత్రిలో డాక్టర్‌కు చూపించుకుని సాయంత్రం ఎస్వీ కాంప్లెక్స్ వద్ద ఉన్న అమరావతి హోటల్ వద్దకు వచ్చాడు. అక్కడ బంగారు ఆభరణాలు కారులో ఉంచి కారుకు లాక్ చేసి లోపలికి వెళ్లి అందరూ కలిసి టిఫిన్ చేసి బయటకు వచ్చారు. తర్వాత వెల్దుర్తి వెళ్లాక రాత్రి చూసుకుంటే బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో హుటాహుటిన కర్నూలు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. పోలీసులు అమరావతి హోటల్ సమీపంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలిస్తే.. ఓ యువకుడు బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించారు. ఆ యువకుని కోసం ఆరా తీస్తున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైకు చోరీ..

కొలిమిగుండ్ల: రహదారి పక్కనే పార్కింగ్ చేసి ఉన్న బైక్ ను పట్టపగలే దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన కొలిమిగుండ్లలో జరిగింది. గ్రామానికి చెందిన కుల్లే సాయినరసింహులు లారీ హమాలీ పనికి వెళ్తూ తన బైకును గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కనే బైకును పార్కింగ్ చేసి తాళం వేసి వెళ్లాడు. హమాలీ పని ముగించుకొని తిరిగి వచ్చేసరికి బైకును దుండగుడు ఎత్తుకెళ్లాడు. ఈ దృశ్యం మొత్తం అక్కడే ఉన్న సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కల్లుదేవకుంటలో చోరీకి గురైన బీరువాను చూపుతున్న మహిళ

కల్లుదేవకుంటలో చోరీ..

మంత్రాలయం: మండలంలోని కల్లుదేవకుంట గ్రామానికి చెందిన తాటికాయ కురువ లక్ష్మి ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన గురువారం పట్టపగలే జరిగింది. మంత్రాలయం హెడ్‌కానిస్టేబుల్ అంజినేయులు తెలిపిన వివరాలివీ.. ఉదయం పిల్లలు పాఠశాలకు వెళ్లగా కేటీ రామాంజినేయులు, లక్ష్మి దంపతులు పత్తి పొలానికి వెళ్లారు. సాయంత్రం పాఠశాల నుంచి కూతురు వీరేశమ్మ ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులుగొట్టి తలుపులు తెరవబడి ఉన్నాయి. ఇంట్లో ఉన్న బీరువా పగలగొట్టి 15 గ్రాముల బంగారు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.10 వేలు నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకొని వెళ్లారు. చోరీ జరిగిన విషయం మంత్రాలయం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ రామాంజులు తన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. గురువారం రాత్రి కావడంతో శుక్రవారం క్లూస్‌టీం ద్వారా వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు. బాధితురాలు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దొంగలను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

అప్రోచ్ రోడ్డును పరిశీలించిన జేసీ



ఎంఐజీ లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ

బేతంచెర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల నగర పంచాయతీ బుగ్గానపల్లె గ్రామ పరిధిలో ఉన్న ఎంఐజీ లే అవుట్‌ను కర్నూలు జాయింట్ కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ నూరుల్ కమర్ గురువారం పరిశీలించారు. ఎంఐజీ లేఅవుట్‌లో 20 అడుగుల అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయడానికి లే అవుట్ నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారనే సమాచారం మేరకు జేసీ ఈ లేఅవుట్‌ను, దాని మ్యాప్‌ను కూడా ఆయన పరిశీలించారు. తమ అనుమతి లేకుండా 20 అడుగుల అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని లేఅవుట్ లైన్ నిర్వాహకులను ఆయన హెచ్చరించారు. ఆయన వెంట బేతంచెర్ల తహసీల్దార్ నాగమణి, నగర పంచాయతీ కమిషనర్ కమిషనర్ హరిప్రసాద్, వీఆర్వో రమేష్ చౌదరి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘ఈ-శ్రమ్’ కార్డులపై అవగాహన సదస్సు



కార్డులను అందజేస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు

కర్నూలు కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సూచనల మేరకు గురువారం నగరంలోని బుధవారపేటలో ‘ఈ-శ్రమ్’ కార్డుల నమోదు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లీగల్ సర్వీస్ యూనిట్ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ అసంఘటిత శ్రామికుల భద్రత, సంక్షేమం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, ప్రతి హక్కుదారుడికి చేర్చేందుకు ఈ శిబిరం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారని తెలిపారు. అసంఘటిత శ్రామికులకు ఈ శ్రమ్ కార్డుల వల్ల కలిగే లాభాలను, ప్రమాద బీమా ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కేశన్న, సయ్యద్ అబ్బాస్, షేక్ జకియా, బి. రామాంజినేయులు,ల డి. జేమ్స్ శేషగిరి శెట్టి, విక్రమ్‌సింగ్, కూసుపాటి బాబ్జీ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి హాజరైన మాజీ సీజేఐ ఎన్వీ రమణ



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎన్వీ రమణ

శ్రీశైలం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం పీఆర్వో తాడికొండ శ్రీనివాసరావు కుమారుడు ప్రవీణ్ కుమార్ వివాహం శ్రీశైలంలో జరిగింది. ఈ వివాహ వేడుకకు సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ హాజరై వధువరులను ఆశీర్వదించారు. ఇదే వివాహానికి శ్రీశైలం ఆలయ ట్రస్టుబోర్డు అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు, ఆలయ ఈఓ శ్రీనివాసరావు, ట్రస్టుబోర్డు సభ్యులు వెంకటసుబ్బారావు, పారిశ్రామికవేత్త చుక్కపల్లి రమేష్ తదితరులు హాజరయ్యారు.

బీఈడీలో నలుగురి డిబార్

కర్నూలు అర్బన్ , నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ 3వసెమిస్టర్ పరీక్షలో ఇద్దరు, ఎంపీఈడీ 3వ సెమిస్టర్ పరీక్షలో ఇద్దరు, మొత్తం నలుగురిని డిబార్ చేసినట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డా. ఎస్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 24 పరీక్షా కేంద్రాల్లో బీఈడీకి 3,709మంది దరఖాస్తు చేసుకోగా, 3,483 మంది హాజరయ్యారని, ఎంపీఈడీకి 104మంది దరఖాస్తు చేసుకోగా 95 మంది పరీక్షలు రాశారని పేర్కొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

ఆళ్లగడ్డ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరాయిపల్లె మెట్ట వద్ద కారు ఢీకొన్న ప్రమాదంలో పుల్లమ్మ(55) అక్కడిక్కడే మృతి చెం దింది. గోపులాపురం గ్రామానికి చెందిన పుల్లమ్మ వేయించిన చెనక్కాయలను గ్రామ పరిసరాల్లో అమ్ముకొని జీవనం సాగించేది. ఈ నేపథ్యంలో పుల్లమ్మ చెనక్కాయలు అమ్ముకొని తిరిగి ఇంటి వెళ్తూ రోడ్డు దాటుతుండగా కారు అతి వేగంగా ఢీ కొంది. దీంతో పుల్లమ్మ అక్కడికక్కడే మృతి చెం దింది. అయితే కారు ఢీకొట్టి అతి వేగంగా వెళ్లిపోయింది. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడి అరెస్టు

కొలిమిగుండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుడి గ్రామంలో వాహనాన్ని కాల్చివేసిన ఘటనలో నిందితుడిని గురువారం అరెస్ట్ చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. ఎర్రగుడి గ్రామానికి చెందిన నిమ్మకాయల శశితేజ మరో యువకుడు కలిసి ఈనెల 11న అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన పోలు సురేష్ వాహనాన్ని పెట్రోల్ పోసి కాల్చివేశారు. ఈ కేసులో శశితేజను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామని, మరో నిందితుడు పరారీలో ఉన్నాడని సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో యువకుడికి జైలుశిక్ష

చాగలమర్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఓ యువకుడికి ఆళ్లగడ్డ జేఎఫ్‌సీఎం కోర్టు 14 రోజులు జైలుశిక్ష విధించింది. ఇటీవల చాగలమర్రిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పాతబస్టాండుకు చెందిన ఏ.హుసేన్‌బాష పట్టుబడ్డాడు. పట్టుబడిన యువకుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి టి.భాస్కర్ 14 రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బేతంచెర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జాతీయ రహదారి పక్కన వెళుతున్న మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి కారు వచ్చి ఢీకొట్టింది. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో తండ్రీ కొడుకులు సుబ్బారావు, ఏకాంబరం గాయపడ్డారు. బనగానపల్లె మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కమ్మ సుబ్బారావు తన కొడుకు ఏకాంబరంతో కలిసి బైక్‌పై రామకృష్ణాపురం నుంచి బేతంచెర్లకు వస్తుండగా.. వెనుక నుంచి వచ్చిన ఏపీ 40 ఈఎక్స్ 3933 అనే నెంబరు గల కారు ఢీకొట్టింది. గాయపడిన తండ్రి కొడుకులకు బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

- తుంగభద్రలో దూకుతుండగా కాపాడిన పోలీసులు

మంత్రాలయం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్నాటకకు చెందిన దంపతులు మంత్రాలయం వద్ద తుంగభద్ర నదిలో దూకుతుండగా పోలీసులు కాపాడారు. ఈ సంఘటన గురువారం సాయంత్రం ఉత్తర కర్నాటక హొన్నవర్ పోలీసుస్టేషన్ పరధిలోని కెరికోణ గ్రామానికి చెందిన మంజునాథ్ గణపయ్య నాయక్, వీణ మంజునాథ అనే దంపతులు రెండు రోజుల నుంచి గ్రామంలో కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు హొన్నవర్ పోలీసుస్టేషన్‌లో ఈనెల 26న అదృశ్యం కేసు నమోదు చేశారు. వారు మంత్రాలయం వచ్చారని కర్నాటక పోలీసులు మంత్రాలయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, కానిస్టేబుల్ నది వద్దకు వెళ్లి పరిశీలిస్తుండగా దంపతులు తుంగభద్రనదిలో దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడటాన్ని చూసి, కాపాడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. విచారించగా అప్పులబాధతో ఆత్మహత్య చేసుకోడానికి వచ్చామని చెప్పడంతో కర్నాటక పోలీసులకు సమాచారం ఇచ్చారు.

నగర పరిశుభ్రత పౌరుల బాధ్యత

కర్నూలు న్యూసిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగర పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ పట్ల పౌరులు బాధ్యతగా వ్యవహరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ పేర్కొన్నారు. నగర పాలక కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఖాళీ స్థలాలను యజమానులు వెంటనే శుభ్రం చేసుకోవాలని లేనపక్షంలో నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. రహదారులపైకి పశువులను వదిలితే జరిమాన విధించి, గోశాలకు తరలిస్తామన్నారు. వారం లోపు జరిమానా చెల్లించకపోతే యాజమాన్య హక్కులు రద్దవుతాయన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాల్స్ నిర్వాహకులు ఆహార వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారవేస్తుండటంతో కుక్కల బెడద పెరుగుతోందని, వాటిని చెత్త సేకరణ వాహనాలకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

వలసలు నివారించాలి


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నారాయణ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ కోరారు. గురువారం మాట్లాడుతూ డిసెంబర్ 1న అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ అధ్యక్షతన సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో పనులు లేక కూలీలు దూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యక్షుడు కే. లింగన్న, సహాయ కార్యదర్శి బి. నాగన్నర, బాలక్రిష్ణ, శ్రీరాములు, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల దరికి చేర్చండి

కర్నూలు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల దరికి చేర్చాలని ఎంపీడీవో రఘునాథ్, ఎంపీపీ వెంకటేశ్వరమ్మ సూచించారు. గురువారం కర్నూలు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. 14 అంశాలకు సంబంధించిన అజెండాను అధికారులు చదివి వినిపించారు. సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అప్రమత్తం చేసి ప్రజలను చైతన్యం చేయాలని ఎంపీడీవో, ఎంపీపీ సభ్యులను కోరారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రఘునాథ్

జాతీయ పోటీలకు సంపత్ కుమార్

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్కూల్ గేమ్స్ అండర్-14 ఫుట్‌బాల్ పోటీలకు బి. క్యాంపు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.సంపత్ కుమార్ ఎంపికై నట్లు హెచ్ఎం జి.శంకర్ తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగిన రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీల్లో సంపత్ కుమార్ ప్రతిభ చూపాడన్నారు. పీడీ విజయకుమార్, జగన్మోహన్ చారిని అభినందించారు. ఉపాధ్యాయులు ఆనంద్, చౌడయ్య, రామమోహన్, కిరణ్ పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం

నూతన కోర్సులు ప్రవేశపెట్టాలి

కర్నూలు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో నూతన కోర్సులు ప్రవేశపెట్టి, పరిశోధక విద్యను అభివృద్ధి చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అబ్దుల్లా డిమాండ్ చేశారు. గురువారం యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ వర్సిటీ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో మాట్లాడుతూ పరిశోధనలో యూనివర్సిటీ వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సందీప్ నాయక్, కార్యదర్శిగా రామకృష్ణ, సహాయ కార్యదర్శులుగా ఓబులేష్, శ్యామ్‌కుమార్, విక్రమ్, భరత్‌తేజతో పాటు 16 మందిని ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఇన్‌చార్జి ప్లానర్‌గా వెంకటరమణ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగర పాలక ఇన్‌చార్జి పట్టణ ప్రణాళికా విభాగం అధికారిగా(సిటీ ప్లానర్) వెంకటరమణను నియమిస్తూ నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రదీప్ కుమార్ దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లారు. పరిపాలన సౌలభ్యం కోసం డిప్యూటి సిటీ ప్లానర్ వెంకటరమణను ఇన్‌చార్జిగా నియమించారు.

చట్టాన్ని ధిక్కరిస్తే కఠిన చర్యలు

సి.బెళగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చట్టాన్ని ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వేణుగోపాల్‌రాజు హెచ్చరించారు. గురువారం మండలంలోని పోలకల్లులో గ్రామస్థులతో మాట్లాడుతూ క్షణికావేశాలకు లోనుకాకుండా, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడవద్దని, వ్యక్తిగత వివరాలను ఇతరులకు తెలుపరాదన్నారు. మద్యం, గుట్కా, పేకాటకు పాల్పడితే వదిలేది లేదన్నారు. హెడ్‌కానిస్టేబుల్ గౌడ్, తిమ్మప్ప, శ్రీరాములు, శ్రీనివాసులు ఉన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గూడూరు నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మండల టీడీపీ అధ్యక్షుడు జె.సురేశ్ అన్నారు. గురువారం మండలంలోని కెనాగలాపురం గ్రామంలో 'రైతన్న మీ కోసం'లో భాగంగా రైతులకు ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


కరపత్రాలు ఇస్తున్న నాయకుడు సురేశ్

ఆలయంలో దాహం



మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవస్వామి ఆలయం వద్ద కుళాయిలకు తాగునీరు రావడం లేదు. రెండు నెలల నుంచి ఇలాగే ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. హంద్రీనదిలో పైప్‌లైన్ పనిచేయకపోవడంతో సమస్య ఏర్పడినట్లు తెలుస్తోంది. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అధికారులు ట్యాంకరుతో నీటిని తెస్తున్నారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు. - **కోడుమూరు రూరల్**

కప్పెట్టేశారు!

నగరంలోని 23వ వార్డు శ్రీరామ్ నగర్ సీఎస్ఐ చర్చి వద్ద మ్యాన్ హోల్ ప్రమాదకరంగా ఉంది. మూత వేయాల్సిన అధికారులు చెట్ల కొమ్మలు వేసి మూసివేశారు. వాహనదారులు, పాదచారులు గమనించకపోతే గుంతలో పడిపోయే ప్రమాదం ఉంది. రాత్రివేళలో చెట్లకొమ్మలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై మూతను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- కర్నూలు న్యూసిటీ



పోటీలతో క్రీడాసక్తి పెరిగే అవకాశం

● వైసీపీ మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి నాగవేణిరెడ్డి



పోటీలను ప్రారంభించిన కల్లా నాగవేణిరెడ్డి

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోటీల నిర్వహణతో విద్యార్థినుల్లో క్రీడాసక్తి పెరుగుతుందని వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణిరెడ్డి అన్నారు. నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో గురువారం అస్మిత ఖేలో ఇండియా షూటింగ్ బాల్ లీగ్ పోటీలను ఆమె ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తే జాతీయ స్థాయికి వారు అభివృద్ధి చెందుతురన్నారు. డీఎస్‌డీవో భూపతిరావు, పరుశురాముడు, సెక్రటరీ రాఘవేంద్ర, పరమేశ్వరరెడ్డి, మదుసూదన్, కిరణ్ కుమార్, సుభాన్ బాషా, పీఈటీలు పద్మలత, మాధవి, నాగేశ్వరి, గీత, సుమలత పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

కోడుమూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం నేరమని వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న అన్నారు. గురువారం కేజీబీవీలో 'బాల్య వివాహ ముక్త్ భారత్'లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలతో అనారోగ్యం, రక్తహీనత, ప్రసూతి మరణాలు చోటుచేసుకునే ప్రమాదం ఉందన్నారు. సమష్టి కృషితో బాల్యవివాహాలను నిర్మూలిద్దామని పిలుపు నిచ్చారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తుంటే సమాచారాన్ని చైల్డ్ లైన్ 1098, పోలీసు 100, దిశా 181, 112 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి స్పెషలాఫీసర్ సుప్రజ, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డా.శ్రీమంత్ మాదన్న

జర్నలిస్టులతో మెరుగైన సమాజం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల ఆరోగ్యంగా ఉంటే మెరుగైన సమాజం సాధ్యమని కేవీ సుబ్బారెడ్డి కళాశాలల చైర్మన్, ఇంజనీరింగ్ విద్యాసంస్థల రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ అసోసియేషన్ భవనంలో జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సీనియర్ జర్నలిస్టులు టీవీ మనోహర్, ఉల్చాల రామస్వామి మాట్లాడుతూ జర్నలిస్టులకు హెల్త్‌కార్డులతో ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత వైద్యసేవలు అందించాలని కోరారు. రైల్వే పాసులు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు, పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు వలి, రంగ, జాకీర్, మెడికవర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కేవీ సుబ్బారెడ్డి

4,5 తేదీల్లో ఎస్ఎఫ్ఐ మహాసభలు

ఓర్వకల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు డిసెంబర్ 4,5 తేదీల్లో నిర్వహించనున్నట్లు నాయకులు సతీష్ కోరారు. గురువారం ఓర్వకల్లులో కరపత్రాలు విడుదల చేశారు. డిసెంబరు 1970లో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం దీర్ఘకాలిక లక్ష్యాలు నిర్దేశించుకున్నామన్నారు. ఎల్లాకృష్ణ, భరత్, రవి, తదితరులు పాల్గొన్నారు.

డా. సుధాకుమారి సేవలు ఉత్తమం


డా.సుధాకుమారిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేఎంసీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా.సుధాకుమారి సేవలు ఉత్తమమని ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ అన్నారు. పదవీ విరమణ పొందుతున్న డా.సుధాకుమారిని ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హెచ్‌వోడీ డా.సుధా కుమారి 38 సంవత్సరాలు కళాశాలలో వైద్యసేవ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డా.పి.బ్రహ్మాజి మాస్టర్, కోశాధికారి డా. శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాళ్లు డా.సాయి సుధీర్, డా.విజయానంద్ బాబు, డా.సింధియా శుభప్రద పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేశాం

● 23, 24 వార్డుల్లో ఇంటింటి ప్రచారం

కర్నూలు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి చేస్తోందని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ప్రవీణ్ అన్నారు. గురువారం నగరంలోని 23, 24 వార్డుల పరిధిలోని శ్రీరాంనగర్‌లో ఇంటింటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలకు వివరించారు. 95వ బూత్ పరిధిలోని ప్రజలకు పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. డ్రైనేజీ ఇబ్బందులను తొలగిస్తున్నామని విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరా విషయంలో ఇబ్బందులు ఉంటే స్థానికంగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కర్నూలుకు పరిశ్రమలు తెచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో మంత్రి ఆహర్నిశలూ కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె. నాగరాజు, మేరీ, తిమ్మప్ప, వీరేష్ గౌడ్, ప్రతాప్, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు రెండు రోజులు నిర్వహించాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే టైప్‌రైటింగ్ పరీక్షలను రెండు రోజుల పాటు నిర్వహించాలని టైప్ ఇన్‌స్టిట్యూట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామలింగన్న డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ సాంకేతిక విద్యాశాఖ జనవరి 26న ఒక్క రోజులోనే నాలుగు బ్యాచ్‌లుగా పరీక్ష ఏర్పాటు చేయడం సబబు కాదన్నారు విజయ్‌కుమార్, జి.వెంకటేశ్వర్లు ఉన్నారు.

నేడు వాహనాల వేలం

కోడుమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శుక్రవారం వేలం వేయనున్నట్లు సీఐ మంజుల తెలిపారు. గురువారం మాట్లాడుతూ పాటదారులు ఉదయం 9 గంటలకు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు వచ్చి వేలంలో పాల్గొనవచ్చని చెప్పారు.

రేపు ఆత్మగౌరవ సభ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డప్పు కళాకారుల ఆత్మగౌరవ సభను 29న నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు ఎండి. ఆనంద్‌బాబు తెలిపారు. గురువారం కేకే భవన్‌లో జిల్లా కార్యదర్శి కరుణాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పాలకులకు కళాకారులకు ఆదరణ చూపడంలేదన్నారు. గుట్టపాడు రామక్రిష్ణ, బి.కృష్ణ, బతుకన్న, ముని పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి

సి.బెళగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని పీఆర్ ఏఈ వెంకట్ ప్రకాశ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గోనె నాయక్ సూచించారు. గురువారం మండలంలోని కొండాపురం గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఏఈ మాట్లాడుతూ పనులు ప్రారంభించే ముందు, ప్రజలు మురుగు కాలువల్లో తాగునీటి పైపులైన్ వేయకుండా చూడాలన్నారు. గ్రామ టీడీపీ నాయకుడు శంకర్‌బాబురెడ్డి ఉన్నారు.

ప్రకృతి సేద్యంతో తక్కువ పెట్టుబడి

● ఏవో రవిప్రకాష్

కోడుమూరు రతూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంతో పెట్టుబడి తగ్గి లాభం వస్తుందని ఏవో రవిప్రకాష్ తెలిపారు. గురువారం కృష్ణాపురం గ్రామంలో రైతన్నా మీకోసం' నిర్వహించారు. డ్రిప్, మైక్రో ఇరిగేషన్ ద్వారా నీటి కొరత తీరుతుందన్నారు. సాగులో యాంత్రీకరణ, భూసార పరీక్షలు, ఫుడ్ ప్రాసెసింగ్ ప్రయోజనాలను వివరించారు. కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ శంకరరెడ్డి, మాజీ సర్పంచ్ హనుమంతు, బలరాం పాల్గొన్నారు.

ఆలయానికి వెండి బహూకరణ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల దత్తజయంతిని పురస్కరించుకుని దక్షిణ షిరిడీగా పేరుగాంచిన షిర్డీ సాయిబాబా ఆలయానికి భక్తులు వెండిని బహూకరించారు. గురువారం బొల్లవరం గ్రామ దంపతులు ఈశ్వరయ్య, పద్మావతి 1.25 కిలోల వెండిని ఆలయ పాలకమండలికి అందజేశారు. ఆలయ పాలకమండలి ప్రధాన కార్యదర్శి మహబలేష్, సజ్జనార్ స్వీకరించారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

తుగ్గలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబీ రసూల్ కోరారు. గురువారం మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్‌లో కమ్యూనిస్టు పార్టీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వాతావరణం సక్రమంగా లేకపోవడంతో కంది పూత రాలిపోయి దిగుబడులు నామమాత్రంగా వస్తున్నాయన్నారు.

రైతు బజార్‌లో వ్యర్థాల తొలగింపు


వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటరమణ కాలనీ అమీన్ అబ్బాస్ నగర్ రైతుబజారులో కూరగాయల వ్యర్థాలను, చెత్తను అధికారులు సిబ్బందిచే తొలగించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో రైతు బజారును శుభ్రం చేయాలి'అంటూ పౌర హక్కుల సంఘం ప్రతినిధులు కోరిన విషయం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎస్టేట్ అధికారి జయలక్ష్మి, సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ ఆదేశాలతో పారిశుధ్య సిబ్బంది ట్రాక్టర్‌ను తీసుకువచ్చి చెత్తను తరలించారు.

కేడీసీసీబీ చైర్మన్ సొంత నిధులతో పనులు


పనులు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

కోడుమూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుమల గుర్తి-వెంకటగిరి పొలాల రస్తా కంప, గుంతలో రైతులకు ఇబ్బందిగా మారింది. విషయాన్ని గ్రామస్థులు కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి దృష్టికి తీసుకెళ్లారు. కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రడెడ్డి తన సొంత నిధులు ఇవ్వడంతో గురువారం స్థానిక టీడీపీ నాయకులు పనులు ప్రారంభించారు. నాయకులు మధు, మల్లేష్, సాయిఈశ్వరప్ప, గోపాల్, రవికుమార్, గోకారి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేగంగా ట్యాంకు పనులు


ఉయ్యాలవాడలో పరిశీలిస్తున్న జేఈ శ్రీనివాసులు

ఓర్వకల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ కింద చేస్తున్న నీళ్ల ట్యాంకుల పనులు వేగంగా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఉయ్యాలవాడ గ్రామంలో పనులను పరిశీలించారు. కాల్వ గ్రామంలో రూ.1.11 కోట్లతో 90వేల లీటర్లు, 40వేల లీటర్ల సామర్థ్యం ట్యాంకులను నిర్మిస్తున్నామన్నారు. కన్నమడకల ఉయ్యాల వాడ, కేతవరం గ్రామాల్లో ఓర్వకల్లులోని చాకలిపేటలో ట్యాంకు పనులు పూర్తి చేశామని, త్వరలో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు.

వాసవి పెనుగొండగా మార్చడంపై హర్షం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెనుగొండను వాసవి పెనుగొండగా మార్చినందుకు ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర హర్షం వ్యక్తం చేశారు. తెలిపారు. గురువారం విజయవాడలో కార్పొరేషన్ చైర్మన్ డుండీ రాకేష్‌తో కలిసి పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు మాట నెరవేర్చారన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

కర్నూలు కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వీహెచ్‌పీ సేవా విభాగం ఆధ్వర్యంలో అమీలియో ఆసుపత్రి సౌజన్యంతో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పాతనగరంలోని యునైటెడ్ క్లబ్‌లో రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, రాష్ట్ర సేవా ప్రముఖ్ పీపీ గురుమూర్తి, జిల్లా అధ్యక్ష ఉపాధ్యక్షుడు టీసీ మద్దిలేటి, గోవిందరాజు శిబిరాన్ని ప్రారంభించారు. పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈపూరి నాగరాజు, శివపురం మణికంఠ, బెస్త పరశురాముడు, యశ్వంత్ పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న అమీలియో సిబ్బంది

అనుమతులు రద్దు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బీఈడీ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని డీవైఎఫ్ఐ డిమాండ్ చేసింది. గురువారం జిల్లా అధ్యక్ష కార్యదర్శి రాఘవేంద్ర, అబ్దుల్లా, ఉపాధ్యక్షుడు హుశేన్ మాట్లాడుతూ బీఈడీని దూర విద్యలా మార్చారని, తరగతులు నిర్వహించకుండానే పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆరోపిచారు.

రేపు మండల సమావేశం

ఓర్వకల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగ అనసూయ గురువారం తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరవుతారన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు, పురోగతిపై చర్చ ఉంటుందని, అధికారులు నివేదికలతో హాజరు కావాలని కోరారు.

కేవీఆర్ కళాశాలలో కరాటే గ్రేడింగ్ టెస్టు


బెల్టు సాధించిన విద్యార్థినులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో యూనివర్సల్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కరాటే గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. మాస్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ మంది విద్యార్థినులు బ్లూబెల్ట్ సాధించా రన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా.రంగారెడ్డి మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యం కూడా వస్తుందన్నారు. డా.ఆర్థి, కోఆర్డినేటర్ పావని, ఇన్‌చార్జి పీడీ పి.మౌనిక, పి.గీత పాల్గొన్నారు

పెద్దహరివాణంలో విలీనం వద్దు

ఆదోని రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన పెద్దహరివాణం మండలంలో తమ గ్రామాలను విలీనం చేయొద్దని బసాపురం రామస్వామి, చాగి మాల రాముడు, నాగనాథనహళ్ళి సుబ్బారెడ్డి, ఢణాపురం శేక్షావలి, నారాయణపురం కారు మంచి కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఆదోని మండలానికి 10కి.మీ. దూరమని పెద్దహరివాణం 35కి.మీ.,పైనే దూరం ఉంటుందని, పనుల నిమిత్తం అంత దూరం వెళ్లాలంటే కష్టమని వాపోయారు. కాబట్టి ప్రభుత్వం ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో మూకుమ్మడిగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అర్హులందరికీ పంట రుణాలు


బాధ్యతలు చేపడుతున్న కొండ రామాంజనేయులు

చిప్పగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పంట రుణాలు అందిస్తామని బెల్డోన సహకార సంఘం చైర్మన్ కొండ రామాంజనేయులు అన్నారు. గురువారం చిప్పగిరిలోని సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్‌లుగా బంటనహాల్ దస్తగిరిస్వామి, నంచర్ల కృష్ణవేణి బాధ్యతలు చేపట్టారు. సహకార సంఘం తరపున రూ.24 కోట్ల పంట రుణాలు అందించినట్లు ఆయన తెలిపారు. రైతులకు కొత్త రుణాలు ఇవ్వడానికి రూ.1 కోటి మంజూరయ్యిందన్నారు. టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి సహకారంతో ఎక్కువ రుణాలు తీసుకొచ్చి బెల్డోన సహకార సంఘంను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీతఓట హరికృష్ణ, టీడీపీ నాయకులు వైకుంఠం వెంకటేష్, కొండా పురుషోత్తం, పోతరాజు రాముడు, రవితేజ్, తిమ్మప్ప, ఎర్రన్న, జయన్నస్వామి, సర్పంచ్ దాసరి గోవిందరాజులు, చిన్న, పుల్లయ్య, గోపాల్, నంచర్ల రవి యాదవ్, తిమ్మప్ప, వెంకట్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ముళ్ల పొదలు


పుల్లాపురం వద్ద రహదారిపై విస్తరించిన ముళ్లపొదలు

దేవనకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాలకు వెళ్లే రహదారులపై ముళ్ల పొదలు కమ్ముకొని ప్రమాదకరంగా ఉన్నాయి. మండలంలోని గద్దెరాళ్ల, జిల్లెడుబుడకల, గుండ్లకొండ, నేలతలమర్రి, ఐరన్‌బండ, పుల్లాపురం, తెర్నేకల్, పాలకుర్తి, బండపల్లి గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా ముళ్ల పొదలు ఏపుగా పెరిగి రోడ్డుపైకి విస్తరించాయి. వాహనాలు ఎదురెదురుగా వస్తే ముళ్ల పొదలు తగిలి ప్రయాణికులు గాయపడుతున్నారు. వాటిని తొలగించాలని ఈ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక సాయం అందజేత

దేవనకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పి.కోటకొండ గ్రామానికి చెందిన కమ్మరి దస్తగిరి గత నెల క్రితం మృతి చెందడంతో, గ్రామానికి చెందిన జ్యోతి టాలెంట్‌స్కూల్ తరపున రూ.5 వేలు ఆర్థిక కుటుంబ సభ్యులకు అందజేశారు. పేద కుటుంబానికి చెందిన దస్తగిరి మృతితో వృద్ధ తల్లిదండ్రులకు పాఠశాల తరపున సహాయం చేసిన్నట్లు కరస్పాండెంట్‌లు తిప్పన్న, లింగన్న తెలిపారు. గ్రామస్తులు వెంకటేశ్వరరెడ్డి, సూరి, తదితరులు ఉన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

ఆలూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొలగవల్లి గ్రామంలో చెన్నకేశవస్వామి రథోత్సవం సందర్భంగా ఎంపీటీసీ బంగారు సునంద పటేల్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో బెంగళూరు-అనంతపురం జట్ల మధ్య ఉత్కంఠ పోరు నడిచింది. చివరకు అనంతపురం జట్టుపై బెంగళూరు జట్టు విజయం సాధించింది. టీడీపీ యువ నాయకుడు బంగారు పటేల్, మాణిక్యరెడ్డి, హనుమప్ప, చెన్నపల్లి చంద్రమోహన్, ఐకాంత్, డాక్టర్లు షేక్షావలి, బజారి, సోమశేఖర్, చిట్టెన్న, వెంకటేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద తుమ్మడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 9వ తరగతి చదువుతున్న షేక్షావలి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మారుతి ప్రియ తెలిపారు. గురువారం ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన షేక్షావలిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహరాజు, రమేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

రీసర్వేలో తప్పులు

మద్దికెర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపా రెవెన్యూ పరిధిలోని హంపా, బొమ్మనపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో గత ప్రభుత్వ చేసిన రీసర్వే తప్పులు ఉన్నాయని ఎంపీటీసీ సభ్యులు విజయలక్ష్మి, టీడీపీ నాయకులు కొత్తపల్లి రంగస్వామి ఆరోపించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ హంపా రెవెన్యూ పరిధిలో దాదాపు 6వేల ఎకరాలకు పైగా పొలం ఉందని, గత ప్రభుత్వ హయాంలో సర్వే తప్పులు తడకగా చేయడం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారనీ అన్నారు. వెంటనే విచారణ చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

నెరవేరిన ఏడేళ్ల కల


పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు బ్రిడ్జి కూలిపోయి ప్రయాణం చేయడానికి నరకంగా మారినా.. వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకోకపోవడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే కల్వర్టు నిర్మిస్తాననీ హామీ ఇచ్చిన పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రత్యేక చొరవ తీసుకుని ఇచ్చిన హామీని నెరవేర్చి కల్వర్టు నిర్మాణాన్ని చేయించారు. దీంతో ఈ గ్రామాల ప్రజలకు రాకపోకలు ప్రారంభమయ్యాయి. వారందరూ పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డును టీడీపీ మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు, బొందిమడుగుల పంచాయతీ సలహాదారుడు ప్రతాప్ యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ మోహన్‌లు కల్వర్టు పనులను గురువారం పరిశీలించి, ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించండి

మద్దికెర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో సర్వే ద్వారా కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించాలని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి, రాగి జీ అన్నారు. గురువారం ఆయా గ్రామాల్లో జరుగుతున్న సర్వేలను తనిఖీ చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లోని ప్రతి ఒక్కరికీ స్కీనింగ్ చేయాలన్నారు. రాగి రంగు మచ్చలు లేదా నరాల్లో అనుమానపు లక్షణాలు ఉంటే వారిని గుర్తించి వెంటనే వైద్యశాలకు పంపాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



మాట్లాడుతున్న టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికై కృషి చేస్తామని టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి తెలిపారు. గురువారం సాయంత్రం ఆలూరు మండలం మొలగవల్లికొట్టాల గ్రామంలో సర్పంచ్ రాజశేఖర్ అధ్యక్షతన ఇంటింటికి మీ వైకుంఠం జ్యోతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోకులం షెడ్ నిర్మాణం పనులను ఆమె ప్రారంభించారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, గ్రామం నుంచి రైల్వేస్టేషన్ వరకు రోడ్డు వేసేందుకు అధికారులను కోరతామన్నారు. కళాకారుల పింఛన్లను మంజూరు అయ్యేలా చూస్తామన్నారు. ప్రతి గ్రామంలో తిరిగి సమస్యలు తెలుసుకుని పరిష్కారం కోసం పని చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, ఎంపీడీఓ మద్దిలేటిస్వామి, ఎస్ఐ మన్మథవిజయ్, ఏపీఓ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు డా.వైకుంఠం సాయిదినేష్, కటారికొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మోటార్ల దొంగను పట్టించిన రైతులు

వెల్దుర్తి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల సమీపంలోని హంద్రీనీవా కాలువ వెంట వేసిన నీటి మోటార్లను దొంగలిస్తున్న దొంగను గురువారం రైతులు పట్టుకున్నారు. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు మల్లెపల్లె, నార్లాపురం, కృష్ణగిరి మండలం గోకులపాడు చెందిన రైతులు హంద్రీనీవా కాలువ వెంట మోటార్లు వేసుకుని పంటలు సాగు చేసుకుంటున్నారు. కొంత కాలం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు మోటార్లను దొంగలిస్తున్నారన్నారు. అయితే గురువారం మధ్యాహ్నం కొందరు వ్యక్తులు మోటార్లను పైకి లాగి ఆటోలో తరలించేందుకు ప్రయత్నిస్తుండగా.. రైతులు గమనించి ఒక వ్యక్తిని పట్టుకున్నారు. మరో ముగ్గురు పరారైనట్లు తెలిపారు. పట్టుకున్న వ్యక్తిని, ఆటోను రైతులు పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతుల సంక్షేమానికి కృషి చేస్తా


కురువ ఈరన్న, డైరెక్టర్లు సునంద, షేక్షావలిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఆలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని ఆలూరు సహకార సొసైటీకి నూతనంగా నియామకమైన కురువ బేవిని ఈరన్న అన్నారు. గురువారం స్థానిక సహకార సొసైటీలో చైర్మన్ కురువ బేవిని ఈరన్న, డైరెక్టర్‌లు సునంద, షేక్షావలి బాధ్యతలు చేపట్టారు. సీతఓట వెంకటరెడ్డి, టీడీపీ జిల్లా నాయకులు కటారికొండ శ్రీనివాసులు, మోకా మల్లయ్య, ప్రవీణ్, బంగారు పటేల్‌యాదవ్, మున్నా, పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీలో చేర్చడంపై పార్లమెంటులో ప్రస్తావించాలి


యోగేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న వాల్మీకులు

పత్తికొండ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాల్మీకుల ఎస్టీ అంశంపైన పార్లమెంటులో ప్రస్తావన చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అబ్జర్వర్ యోగేష్‌కు బోయ వాల్మీకి సమితి నాయకులు విన్నవించారు. గురువారం పత్తికొండకు వచ్చిన ఆయనకు బోయ వాల్మీకి సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు మారెళ్ల అంజి, మహేంద్రనాయుడు, ఏవీ నాయుడు మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వాల్మీకులను ఎస్టీలో చేరుసామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులో ప్రతిపక్షంలో ఉంది కాబట్టి, ఈ సమస్యపై లేవనెత్తాలన్నారు. కార్యక్రమంలో తాయన్న, హనుమంతు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వెల్దుర్తి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు, పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పేరుతో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపాలని, పీపీపీ విధానంతో బడుగు, బలహీన వర్గాల పేద వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయొద్దని ఎన్డీయే కూటమి రాష్ట్ర ప్రభుత్వాన్ని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్రనాథ్, ఏపీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర సభ్యులు నాగ సురేంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. నాయకులు బాలకృష్ణ నాయక్, సూరి, రాజేష్ పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

ఆదోని రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు తెలిపారు. రైతన్న మీ కోసం కార్యక్రమంలోభాగంగా, మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ అధ్యక్షతన టీడీపీ నాయకులు సంతేకుడ్లూరులో పర్యటించి రైతులతో సమావేశమయ్యారు. రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, రంగస్వామి నాయుడు, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెర గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారి రవి ఆధ్వర్యంలో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం మద్దికెర మెయిన్ బజారులో పంచ సూత్రాల కార్యక్రమంలో భాగంగా మీకోసం రైతన్న కార్యక్రమానికి తహసీల్దార్ గూండాల్ నాయక్ పాల్గొన్నారు. ఆనంద్, రేష్మా, పట్టణ టీడీపీ అధ్యక్షులు గడ్డం రామాంజులు, విద్యాకమిటి చైర్మన్ ఓబులాపురం చంద్ర, వీఆర్వో రంగస్వామి పాల్గొన్నారు.

తుగ్గలి: రైతులను అభివృద్ధి చేయడమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని మాజీ జడ్పీటీసీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు అన్నారు. శనివారం మండలంలోని రామలింగాయపల్లె, బొందిమడుగుల, పగిడిరాయి తదితర గ్రామాల్లో ఇది రైతు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చే సందేశంతో పాటు సబ్సిడీ పరికరాలు, వ్యవసాయ పరికరాలు, విత్తనాల గురించి రైతులకు తెలియజేశారు. వ్యవసాయాధికారి సురేష్ యాదవ్, టీడీపీ నాయకులు తిరుపాల్ నాయుడు, ప్రతాప్ యాదవ్, మోహన్, డీలర్ సుంకన్న, మామళ్ల కుంట తిమ్మప్ప, దేవేంద్ర పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి


పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్య స్వామి

మద్దికెర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామంలోని మద్దమ్మ కుంట సమీపాన వెలసిన సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి ఉత్సవాలు ఆలయ నిర్వాహకులు విజయ్ ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగాయి. గురువారం తెల్లవారుజామున మూలవిరాట్ సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించి ఆణిముత్యాల ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనను నిర్వహించారు. ఈ పౌరాణిక నాటకాన్ని డీఎస్పీ వెంకట్రామయ్య ప్రారంభించారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు తుగ్గలి వరలక్ష్మి, ఆలయ కమిటి సభ్యులు జయరాంరెడ్డి, హరిప్రసాద్, శివప్రసాద్, రాము, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ వేధింపులు ఆపాలి


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

ఆదోని రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడి వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, అంగన్‌వాడి వర్కర్, సీఐటీయూ నాయకులు వరలక్ష్మీ, వెంకట లక్ష్మీ, జానకి, తిక్కప్ప, రామాంజిని, తిప్పన్న, వీరారెడ్డి తెలిపారు. ఈనెల 10వ తేదిన నాగలాపురం అంగన్‌వాడి సెంటర్-2లో అస్వస్థతకు గురై 10మంది విద్యార్థులు ఆసుపత్రి పాలు కావడంతో, కారకులైన వర్కర్ పుష్పావతి, ఆయామ్మలను విధులనుండి జిల్లా కలెక్టర్ తొలగించారు. దీంతో ఆగ్రహానికి గురైన నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడి వర్కర్లు, సీఐటీయు ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం వరకూ ఆందోళన చేశారు. విధుల నుంచి తొలగించిన వర్కర్, ఆయాలను విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో పోరాటం తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ


మాట్లాడుతున్న ఏఐసీసీ అబ్జర్వర్ యోగేష్

పత్తికొండ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం జరిగిందని ఏఐసీసీ కర్నూలు జిల్లా అబ్జర్వర్ యోగేష్ అన్నారు. శ్రీజన్ అభియాన్ సంఘటన్‌లో భాగంగా గురువారం పత్తికొండకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని అన్ని రాష్ట్రాల్లో బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో పార్టీ ముందుకెళ్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ భవిష్యత్ పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు. కర్నూలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీని గ్రామగ్రామాన విస్తరింపజేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పీసీసీ అబ్జర్వర్ సాకే శంకర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆముదం పంట చోరీ

పత్తికొండ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ప్రయాసాలు ఓర్చి పంటను సాగుచేశానని, పంట చేతికొచ్చి నూర్పిడి చేసి పొలంలోనే నిల్వ ఉంచిన ఆముదం గింజల బస్తాలను దొంగలించుకుని వెళ్లారని ఓ రైతు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. వివరాల మేరకు.... పత్తికొండ పట్టణం కొండగేరి ప్రాంతానికి చెందిన రైతు రాముడు రెండున్నర ఎకరాల్లో ఆముదం పంటను సాగుచేశాడు. అయితే పంట చేతికి రావడంతో నూర్పిడి చేసి పొలంలోనే నిల్వ ఉంచాడు. సుమారు 10 బస్తాలు దాకా పంటను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని వాపోయాడు. పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసి, న్యాయం చేయాలని కోరాడు.

ఆదోని అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే పార్థసారథి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని అమరావతి నగర్ కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని ఎమ్మెల్యే పార్థసారథి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఆదోని నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని హామీ ఇచ్చానని, అందులో భాగంగానే అమరావతి నగర్ కాలనీలో గడిచిన వారం రోజుల్లోనే రెండోసారి భూమిపూజ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమరావతి నగర్ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ, బీజేపీ నాయకులు ఉపేంద్ర, నూర్జహాన్, పరశురాం, యశోదమ్మ పాల్గొన్నారు.

లింగ వివక్ష తగదు


ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు మహిళలు

మద్దికెర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, పురుష లింగ భేదం విడనాడి అందరూ సమానమేనని లింగ వివక్ష ఉండకూడదని ఏపీఎం రామాంజనేయులు అన్నారు. గురువారం మద్దికెరలో జాతీయ ప్రచారం జెండర్ సమానత్వం కోసం ర్యాలీ నిర్వహించారు. మగ, ఆడ లింగబేధం ఉండకూడదని అందరూ సమానమేనని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పొదుపు మహిళలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ గోవిందు, వీవోఏలు శ్రీనివాసులు, వెంకన్న, లక్ష్మినారాయణ ఉన్నారు.

1.50 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు


సెక్రెటరీతో చర్చిస్తున్న ఏటీఎం నారాయణమూర్తి

● ఏడీఎం నారాయణమూర్తి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతుల నుంచి కనీస మద్దతు ధరతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా ఈనెల 26వ తేదీ వరకు 1లక్ష 50 వేల క్వింటాళ్లకు పైగా పత్తిని కొనుగోలు చేయించామని ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. గురువారం ఆయన ఆదోనిలో సీసీఐ కొనుగోళ్లపై పరిశ్రమలను పరిశీలించేందుకు వచ్చారు. మార్కెట్ యార్డ్ కార్యాలయంలో సెక్రటరీ గోవిందుతో కలిసి ఆయన మాట్లాడుతూ గత నెల 30వ తేదీన జిల్లా వ్యాప్తంగా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందన్నారు.ఇప్పటివరకు 5036మంది రైతుల నుంచి 1.50 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆదోని మార్కెట్ యార్డ్ పరిధిలోని 8 పరిశ్రమలలో 81,508 క్వింటాళ్ల పత్తిని 3347 మంది రైతుల నుంచి సీసీఐ కొనుగోలు చేసిందన్నారు. మరో రెండు పరిశ్రమలు మూడు రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. త్వరలోనే మరిన్ని పరిశ్రమలతో పాటు పరిశ్రమల కెపాసిటీ కూడా పెంచుతామని తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

తుగ్గలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబీ రసూల్ కోరారు. గురువారం మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్‌లో కమ్యూనిస్టు పార్టీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వాతావరణం సక్రమంగా లేకపోవడంతో కంది పూత రాలిపోయి దిగుబడులు నామమాత్రంగా వస్తున్నాయన్నారు. కంది పంటకు గిట్టుబాటు ధర రూ.6వేలు కాకుండా రూ.10వేలు ప్రభుత్వం ప్రకటించాలన్నారు. సీపీఐ జిల్లా సమితి అధ్యక్షులు వెంకటేశ్, మండల కార్యదర్శి సుల్తాన్, ఉమాపతి, సూరన్న, వీరా తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

వెల్దుర్తి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎల్.కొట్టాల గ్రామానికి చెందిన వివాహిత కృష్ణవేణి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణవేణి కుటుంబంలో జరిగిన చిన్నపాటి తగాదాలతో క్షణికావేశానికి గురై ఇంట్లో ఉన్న అన్ని రకాల ట్యాబ్లెట్లను వేసుకుంది. దీంతో అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆఖరి మజిలీకి అవస్థలు


ముళ్లకంపలో మూసుకుపోయిన రహదారి


ముళ్లపొదలతో నిండిన శ్మశాన వాటిక

మద్దికెర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితలో ఆఖరి మజీలీ అయిన శ్మశాన వాటికకు చేరుకునేందుకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గాలి కూడా సక్రమంగా లేక ముళ్లపొదలతో నిండిపోయింది. వర్షం కురిసిన సమయంలో అంత్యక్రియలు జరుపుకునేందుకు మద్దికెర వాసులు నరకం అనుభవిస్తున్నారు. మద్దికెరలో మొత్తం 35వేల జనాభా నివసిస్తున్నారు. ప్రధానంగా నాలుగు హిందూ శ్మశాన వాటికలు ఉన్నాయి. అందులో కొత్తపల్లికి వెళ్లే రహదారి పక్కన గల హిందూవుల శ్మశాన వాటిక అధ్వాన్నంగా తయారైంది. మనిషి మరణిస్తే వారి అంత్యక్రియలకు వెళ్లే సమయంలో ఆ ప్రాంతమంతా దట్టంగా ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. విష పురుగుల సంచారం అధికంగా ఉన్నట్లు తెలుపుతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో రోడ్డు దాటి వెళ్లాలంటే బురదలో వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. ఏళ్ల తరబడి శ్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దారి లేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శ్మశాన వాటికలో దారి కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీలను విజయవంతం చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాచాని సోమప్ప ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరిగే అండర్-17,19 ఖట్కా పోటీలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి పోటీలు ప్రారంభమయ్యాయని చెప్పారు. అనంతరం ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరమ్మ మాట్లాడుతూ పట్టణంలో అండర్-17,19 ఖట్కా పోటీలు మొట్ట మొదటిసారిగా జరుగుతుండడం విశేషమని చెప్పారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు.

కుష్ఠ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి


గోనెగండ్లలో రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర కుష్ఠ వ్యాధి నిర్మూలన బృందం సభ్యులు

గోనెగండ్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కుష్ఠ వ్యాధితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర కుష్ఠ వ్యాధి నిర్మూలన బృందం సభ్యులు శాంతరామ్, రీతీతేశ్వరి, మనీష, రాష్ట్ర కుష్ఠ వ్యాధి నిర్మూలన జాయింట్ డైరెక్టర్ దేవసాగర్ సత్యవతి సూచించారు. గోనెగండ్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కుష్ఠ వ్యాధి నిర్మూలన బృందం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మండలంలో కుష్ఠ వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వే ఎలా జరుగుతుందో తెలుసుకున్నారు. నవంబరు 30వ తేది వరకు ఈ ఇంటింట సర్వే నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సర్వే మండలంలో ఎలా జరుగుతుందని వైద్యురాలు రంగరవళిని అడిగి తెలుసుకున్నారు. కుష్ఠ వ్యాధి సోకిన వ్యక్తిని వారు పరిశీలించారు. వారు మట్లాడుతూ చర్మం పై స్పర్శలేక పోవడ రాగి రంగు గల మచ్చలు, చర్మం పొడిగా ఉండటం, కనురెప్పలపై ఉన్న వెంట్రుకలు రాలిపోవడం, కన్నులు మూత పడక పోవడం, చర్మం మందం కావడం, అరచేతులు, కాళ్ల బొబ్బలు రావడం, చేతి వేళ్ల, కాలివేళ్ల వంకర పోవడం వంచి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. పలు ఆరోగ్య సూత్రల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మృత్తికా బృందావనానికి స్వర్ణ పల్లకీ సేవ


బంగారు పల్లకిలో మృత్తిక బృందావనాన్ని తీసుకెళ్తున్న అర్చకులు

మంత్రాలయం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి మృత్తిక బృందావనాన్ని స్వర్ణ పల్లకిలో దర్శనమిచ్చారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మఠం అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మఠం దివాన్ శ్రీనాథ్ ఆచార్ ఊంజలసేవ నిర్వహించారు. హైదరాబాదు సీఐఎస్‌ఎఫ్ డీఐజీ రాఘవేంద్ర కుమార్ కుటుంబ సమేతంగా గురువారం రాఘవేంద్ర స్వామిని దర్శించు కున్నారు. మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంటేష్ జోషి, సురేష్ కోనాపూర్,శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను ద ర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వ దించారు. నదితీరంలో గోపూజ చేశారు. వీరి వెంట ప్రకాశ్ ఆచార్, పవ న్ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్ లక్ష్మీనారాయణ, రామకృష్ణ, ప్రతాప్ ఉన్నారు.

'ఆక్రమిత స్థలాన్ని కేటాయించడం సరికాదు'

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన గోవిందమ్మకు అధికారులు సరైన స్థలాన్ని కేటాయించకుండా ఆక్రమణలో ఉన్న స్థలాన్ని కేటాయించడం సరికాదని బీఎస్‌ఎస్ అధ్యక్షుడు రామతీర్థం అమరేష్ అన్నారు. గురువారం గోవిందమ్మకు కేటాయించిన స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులు భాదితురాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే పోరాడతామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ హఫీజ్, వీఆర్వో బసవరాజు, గడ్డం నాగేంద్ర, కదిరికోట బతుకమ్మ, సుమాల చార్లెస్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఓటరు జాబితాను మ్యాపింగ్ చేయాలి'

గోనెగండ్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వచ్చే పది రోజుల లోపు బీఎల్‌వోలు ఆయా గ్రామాలలోని పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ లిస్టులను మ్యాపింగ్ చేయాలని తహసీల్దార్ రాజేశ్వరి సూచించారు. గోనెగండ్లలోని తహసీల్దార్ కార్యాలయం దగ్గర గురువారం బీఎల్‌వో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 68 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అందులో 68 బీఎల్‌వోలు ఉన్నారన్నారు. మండలంలో ఇప్పటి వరకు 58,653 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పలు గ్రామాల బీఎల్‌వో పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బీఎన్ ఈరన్న


కూమార స్వామిని సన్మానిస్తున్న ఈరన్న

ఎమ్మిగనూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఎన్ ఈరన్నను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. విజయవాడలో బుధవారం జరిగిన రాష్ట్ర కిసాన్ మోర్చా సమావేశంలో రాష్ట్ర కమిటీ ని రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి ప్రకటించారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎమ్మిగనూరుకు చెందిన బీఎన్ ఈరన్నను నియమించారు. జిల్లా అధ్యక్షుడు నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎంపిక కావడం పట్ల కర్నూలు, ఎమ్మిగనూరు కిసాన్ మోర్చా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనను ఎంపిక చేయటం పట్ల బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కూమారు స్వామికి ఈరన్న కృతజ్ఞతలు తెలిపారు. రైతు సమస్యలపై పోరాటం చేస్తమన్నారు.

పొద్దు తిరగని పువ్వు

● పొద్దు తిరుగుడు పంటపై ఆసక్తి చూపని అన్నదాతలు ● రబీలో ఎకరా కూడా సాగు చేయని రైతులు



గోనెగండ్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఈ రబీ సీజన్‌లో పొద్దుతిరుగుడు పంట సాగు పూర్తి గా పడిపోయింది. ఇప్పటి దాకా ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలో ఒక్క ఎకరా కూడా పొద్దుతిరుగుడు పంట ను రైతులు సాగు చేయలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతన్నలు మిరప, ఉల్లి , పత్తి పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. నాలుగేళ్ల నుంచి పొద్దుతిరుగుడు పంట సాగు డివిజన్ పరిధిలో తగ్గిపోయింది. ఒకప్పుడు ఈ ప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో పొద్దుతిరుగుడు పంటను రైతులు అధికంగా సాగు చేసేవారు. అయితే నాలుగైదేళ్లగా ఖరీఫ్ లో పొద్దతిరుగుడు పంట పై మక్కువ చూపటం లేదు. గత ఏడాది డివిజన్‌లోని గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలంలో కొన్ని గ్రామాల్లో 10 నుంచి 15 ఎకరాల్లోపే సాగు చేసినట్లు సమాచారం.

పంటకు సోకే వైరసే కారణం

పొద్దు తిరగుగు పంటకు గత కొన్నేళ్లగా అంతు చిక్కని వైరస్ సోకడం ఈ కారణంగా పంట దిగుబడి పూర్తి తగ్గిపోవడం తో రైతులు ఈ పంటకు బదులు మరో పంట సాగుకు అలువాటు పడ్డారు. నెక్రోసిస్ అనే వైరస్ వల్ల, ఎక్కువగా వ్యాధులు సోకడం వల్ల గింజ నాణ్యత పడిపోయి నట్ట గింజలు రావడంతో పండిన పంటకు గిట్టుబాటు లభించకపోవడం కారణంగా పంట సాగు తగ్గిపోతున్నట్లు తెలుస్తోంది.

పెట్టుబడి ఇలా..

ఎకరాకు పెట్టుబడి రూ. 30వేల నుంచి రూ.40వేల వరకు వస్తుంది. దిగుబడి కూడా తగ్గి పోవడం మరో కారణం దిగుబడి కూడా ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల లోపే దిగుబడి వస్తుంది. పండిన పంటకు క్వింటా రూ. 3500 నుంచి రూ. 4వేల వరకు పలికేది. మొత ్ం రూ. 16వేల వచ్చేది. పెట్టు బడి కూడా చేతికి అందేది కాదు. ఈ కారణంగా పొద్దు తిరుగుడు పంట కారణంగా పెట్టిన పెట్టుబడికూడా చేతికి అందేది కాదు. దీంతో రైతులు ఆ పంటను సాగు చేయడం మానుకున్నారు. దీనికి ప్రత్యామ్నాయ పంటను సాగు చేసుకోవడం మొదలు పెట్టారు. పొద్దుతిరుగుపంటను సాగు చేసుకునే రైతులు ఎక్కువ మంది మొక్కజొన్న, పత్తి పంటను సాగు చేస్తున్నారు.

వైరస్ వల్లే ఆసక్తి చూపడం లేదు



పొద్దు తిరుగుడు పంటకు నెక్రొసిస్ అనే వైరస్ సోకడం కారణంగా పంట దిగుబడి తగ్గిపోయింది. పిచికారీ మందుల వ్యయం ఎక్కువ కావడం ఇంత చేసినా కూడా వైరస్ అదుపులోకి రాక పోవడం పంట దిగుబడి తగ్గపోగా పండిన పంటకు గిట్ట బాటు ధర పలకకం లేదు. దీంతో రైతులు ఈ సాగు ను మాని వేసి ప్రత్యామ్నాయ పంటను సాగు చేసుకోవడం మొదలు పెట్టారు. ఈ రబీ సీజన్‌లో ఇప్పటి వరకు డివిజన్ లో ఒక్క ఎకరం కూడా పొద్దు తిరుగుడు పంట సాగు కాలేదు.

మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ ఎమ్మిగనూరు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● కొందరికి మాత్రమే కాదు.. అందరికీ ఎమ్మెల్యేను ● బీవీ జయనాగేశ్వరరెడ్డి
● ఇది రైతు ప్రభుత్వం ● టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి


కామన్‌దొడ్డిలో మాట్లాడుతున్న రాఘవేంద్ర రెడ్డి


పూలచింతలలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తనకు ఓటు వేయని వారికి కూడా తాను ఎమ్మెల్యేను అని, అర్హులైన ప్రతిపక్ష నాయకులకు కూడా ప్రభుత్వ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. వెంకటగిరి గ్రామంలో గురువారం రైతన్నా మీకోసం- అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలోని ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ వెంకటగిరి గ్రామంలో గత వైసీపీ పాలకులు అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేశారన్నారు. గ్రామానికి నడిచేందుకు కూడా రోడ్డు లేకపోవడంతో ప్రధాన రహదారి వేసినట్లు తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేశామన్నారు. అయినప్పటికీ వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో అబ్దుర్‌వర్ టిప్పుసుల్తాన్, మండల కన్వీనర్ కె.టి వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, కొటేకల్ జగదీష్, గ్రామ నాయకులు వీరప్పనాయుడు, కోటా నరసింహయాదవ్, శేకన్న యాదవ్, బోయ పరమేష్, వెంకటేష్, వీరాంజనేయులు, గంగాధర్, రామానాయుడు, నరేంద్ర, బత్తిని నాగరాజు లతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● కడిమెట్ల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం తమ గ్రామానికి బస్సును ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరడంతో తక్షణమే స్పందించిన ఆయన ఆర్టీసి డీఎంతో ఫోన్‌లో మాట్లాడారు. దీంతో విద్యార్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కోసిగి: ఇది రైతు ప్రభుత్వం అని టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా గురువారం కామన్‌దొడ్డి గ్రామంలో రైతుల ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ ఏడీ బాలవర్ధిని రాజు, ఏవో వరప్రసాద్ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. రాఘవేంద్రరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని చావిడి వద్ద రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని


కరపత్రాలను పంపిణీ చేస్తున్న రమాకాంతరెడ్డి

ప్రోత్సహించాలని, రసాయన ఎరువులు తగ్గించి ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించి రైతులు లాభాలు పొందాలన్నారు. అలాగే నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటలు పండించడం, వ్యవసాయంలో టెక్నాలజీని ఉపయోగించడం వంటి విలువైన విషయాలను రైతులకు తెలియజేశారు. టీడీపీ నాయకులు రాజారెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మండల అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ నర్సారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నాడిగేని అయ్యన్న, మాజీ జడ్పీటీసీలు తోవి రామకృష్ణ, జక్కనగేని వెంకటేష్, వక్రాణి వెంకటేష్, జ్ఞానేష్, అనంతసేనా రెడ్డి, ఈరన్న, దొడ్డయ్య, ఈరేష్, మామల్లి వీరేష్, సొట్టయ్య, గౌస్, కోసిగయ్య, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: రైతులందరినీ ఆదుకుంటామని తెలుగు రైతు అధికార ప్రతినిధి నరవరమాకాంతరెడ్డి అన్నారు. హనుమాపురం గ్రామంలో గురువారం రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులను కలుసుకొని అన్నదాత సుఖీభవ నగదు జమపై రైతులను అడిగి తెలుసుకున్నారు. నాయకులు ఈరన్న, రంగన్న, పెద్దయ్య, రాజు, ఓబులేసు పాల్గొన్నారు.

నందవరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే టీడీపీ లక్ష్యంగా పెట్టుకుందని ఆ పార్టీ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త భాస్కరభట్ల చంద్రశేఖర్ అన్నారు. పూలచింతలో బండేగురు స్వామి, టీడీపీ మండల కన్వీనర్ కాశీంవలీ, మండల సహకార సంఘం అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్ రైతన్నా మీకోసంలో భాగంగా రైతులతో మాట్లాడారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దశల వారిగా నెరవేరుస్తున్నారన్నారు సంక్షేమ పథకాల గురించి వివరించారు. అన్నదాత సుఖీభవ డబ్బులు పడడంతో రైతులు హర్షం వ్యక్త చేస్తున్నారని అన్నారు. నందవరంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు భీమశేఖర్ ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యాక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర నాయకులు డీవీ రాముడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు లచ్చప్ప, రామకృష్ణారెడ్డి, మల్లేష్ సత్యారెడ్డి, తిప్పారెడ్డి, వడ్డే గోపాల్ పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి


మాట్లాడుతున్న సర్పంచ్

గోనెగండ్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని ప్రతి ఇంటి యజమాని తన ఇంటి నెంబర్‌కు ఆధార్, ఫోన్ నెంబరు పంచాయతీ కార్యాలయంలో అనుసంధానం చేసుకోవాలని మేజర్ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ సూచించారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2025-26 కు సంబందించిన పన్నులు వందశాతం వసూళ్ల చేయాలని గతంలో పెండింగ్‌లో ఉన్న పన్నులు కూడా ఈ ఏడాది వసూళ్ల చేసి పంచాయతీ ఆదాయాన్ని పెంచి అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. అలాగే ప్రతి ఇంటి యజమాని ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్‌తో వెళ్లి ఇంటి నెంబర్‌కు లింక్ చేయించు కోవాలని కోరారు. గ్రామంలో ప్రతి మంగళవారం, శని, గురు వారాల్లో పారిశుధ్యకార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య తీర్చేందుకుగాను గ్రామంలో నాలుగు ఓహెచ్ఆర్ ట్యాంక్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్‌బాషా, సుభాన్, అనిల్ పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించే దాకా ఉద్యమం


మాట్లాడుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగావకాశాలు కల్పించే దాకా కార్మికుల ఉద్యమం ఆగదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప అన్నారు. మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తూ మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలంటూ పట్టణంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 11వ రోజుకు చేరుకుంది. గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ, ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ శివకృష్ణ అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటటీలో విధులు నిర్వర్తిస్తూ 13 మంది మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించి, జీవో నెంబర్ 25 ప్రకారం రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లుగా ఈ సమస్యను నిర్లక్ష్యం చేయడం సరికాదని అన్నారు. అదే విధంగా కార్మికులకు ఇవ్వాల్సిన కొబ్బరి నూనె, యూనిఫామ్, సరెండర్ లీవ్‌ల డబ్బు చెల్లించాలన్నారు. ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, సీపీఐ పట్టణ కార్యదర్శిలు రంగన్న, విజయేంద్ర, ఏఐటీయూసీ కార్యదర్శి తిమ్మగురుడు, రాజీవ్, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందాలి


తుంగభద్ర పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

మంత్రాలయం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందాలని, మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిమాణం, మెనూ చూడాల్సిన బాధ్యత హెచ్‌ఎం తో పాటు ఉపాధ్యాయులందరిపై ఉందని ఎంఈవో రాగన్న రాంపురం పాథమిక, తుంగభద్ర జడ్పీ ఉన్నతపాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు, విద్యా బోధన, మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, పరీక్షల నిర్వహణ, ఆయా పనితీరును పరిశీలిం చారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక సూచనలు, సలహాలు చేశారు. హెచ్‌ఎం నారాయణ, రవి కుమార్, నాగరాజు, రాజు, వెంకటలక్ష్మి, అమీనాబీ పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉరుసు

మంత్రాలయం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చెట్నహళ్లి గ్రామామంలో తిక్కతాతస్వామి గురువారం వైభవంగా ప్రారంభ మయింది. గురువారం గంధం నిర్వహించారు. తిక్కతాత సమాధి వద్దకు జెండాను ఊరేగింపుతో తీసుకొచ్చి ఆవిష్కరించారు. వివిధ రకాల విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు.

కామన్‌దొడ్డిలో కంపు.. కంపు

● నిండిపోయిన డ్రైనేజీలు
● తాగునీటి ట్యాంకు వద్ద పారుతున్న మురుగు
● ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు


తాగునీటి ట్యాంకు వద్ద మురుగు నిల్వ

కోసిగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కామన్‌దొడ్డిలో కంపు కంపు కొడుతోంది. డ్రైనేజీలు నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. తాగునీటి ట్యాంకు వద్ద డ్రైనేజీ నీరు నిల్వ చేసి నీరు కలుషితమవుతున్నాయి. కనీసం నిండిపోయిన డ్రైనేజీలలో మురుగు తొలగించకపోవడంతో కామన్‌దొడ్డి గ్రామంలో కంపు కొడుతోంది. రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని డ్రైనేజీలు తాగునీటి ట్యాంకు వద్ద మురుగునీరు నిల్వ ఉండటంతో పంచాయతీ అధికారులు సమస్యలు పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాగునీటి ట్యాంకు వద్ద ప్రభుత్వ బడికి సంబంధించి మధ్యాహ్న భోజనం వంట గది వద్ద మురుగు నిల్వ ఉంటోంది. వంట చేసే ఆ సమయంలో ఆ మురుగు దోమల నిల్వ ఉండి


పాఠశాలలో వంట గది వద్ద నిలిచిన మురుగు

వంట పాత్రలపై రావడంతో ఆ భోజనం చేసి విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పారిశుధ్యం లోపించి జ్వరాల బారిన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో దోమల బెడద తీవ్రంగా ఉందని, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదని వాపోతున్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

● చిన్నతుంబళం పాఠశాలలో ప్రమాదకరంగా విద్యుత్ తీగ


పాఠశాలలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగ

పెద్దకడబూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పక్కచిత్రంలో కనిపిస్తున్న దృశ్యం మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలోనిది. గ్రామంలో ఉన్న పాఠశాలలో విద్యార్థుల కోసం తాగునీటి సౌకర్యం కోసం బోరును ఏర్పాటు చేశారు. అయితే ఈ బోరుకు వేసిన తీగను విద్యార్థులు నిత్యం చేతులు శుభ్రం చేసుకునే చోట వేలాడుతూ ఉంది. తీగ పక్కనే విద్యార్థులు నీటిని తాగుతూ ఉంటారు. విద్యుత్ సరఫరా సమయంలో చిన్నారులు ఎవరైనా ఆడుకుంటూ ఆ తీగను లాగితే విద్యుత్‌దఘాతానికి గురయ్యే ప్రమాదం లేకపోలేదు. నిత్యం పాఠశాల ఉపాధ్యాయులు ఈ తీగను చూస్తున్నప్పటికీ ఎందుకు స్పందించడం లేదోనని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగను విద్యార్థులకు అందకుండ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.